PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 91, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 21 - మే - 2026 , వెల రూ.5/-



## అందరి డేటా నా దగ్గర ఉంది

ప్రసంగాలు సరే.. పనితీరు మెరుగవ్వాలి..

అధికారం ఉందని పదిమందిని వెంటేసుకుని తిరగడం కాదు. అలా చేస్తే పార్టీ నిర్వీర్యమవుతుంది

పార్టీ కోసం పనిచేసేవారిని వదిలి.. మీ ఇళ్లలో ఉండేవారికి పదవులు ఇవ్వడం, ఆపై మీరే పెత్తనం చేయడం తగదు

దురుసుతనం తగ్గించుకుని.. అందరితో కలిసి వెళ్లాలి

రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరిలో కావలి ఎమ్మెల్యే 107వ స్థానంలో ఉన్నారు

# విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

### మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌లా వ్యవహరిస్తా

మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్లా వ్యవహరిస్తానన్న సీఎం చంద్రబాబు

వేట నిషేధ సమయంలో 1.30 లక్షల కుటుంబాలకు రూ. 262 కోట్ల ఆర్థిక సాయం

మత్స్యకార మహిళల కోసం సీవీడ్ సాగు, 60% సబ్సిడీపై 200 మెకనైజ్డ్ బోట్లు

మన జలాల్లో గస్తీ పెంచి ఇతర రాష్ట్రాల బోట్లను అడ్డుకుంటామని హామీ

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, తీర గ్రామాలకు మెటల్ రోడ్ల ప్రకటన




అమరావతి: గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, మత్స్య రంగం కూడా తీవ్రంగా దెబ్బతిందని చంద్రబాబు ఆరోపించారు. మిగతా..2లో

## తెలంగాణలో భగభగ: 47 డిగ్రీలకు చేరనున్న ఎండలు, పలు జిల్లాలకు రెడ్ అలర్ట్



గురువారం నుంచి మరింత పెరగనున్న ఎండల తీవ్రత

పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ

రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరే అవకాశం



## స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు: షర్మిల

వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్న షర్మిల

బటన్లు నొక్కినంత మాత్రాన మళ్లీ సీఎంలు కాలేరని ఎద్దేవా

అమరావతి: వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని ‘ఒక్క ఛాన్స్’ అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి నాడు ఉందని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తండ్రి ఆశయాల పేరిట ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆ ఆశయాలనే జగన్ నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ సీఎం అయ్యాక కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తల ఊపుతూ, అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు.

# ప్రాజెక్టుల భూసేకరణనూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి

### 1226 గ్రామాలకు తాగునీరు : మంత్రి ఉత్తమ్

'పాలమూరు'కు యుద్ధప్రాతిపదికన భూసేకరణ

జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది

భూసేకరణలో జాప్యం జరగకుండా తక్షణమే బిల్లుల చెల్లింపులు జరిగేలా చూస్తాం

జూరాల పూడిక తొలగింపు



హైదరాబాద్: పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల భూసేకరణనూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణలో జాప్యం జరగకుండా తక్షణమే బిల్లుల చెల్లింపులు మిగతా..2లో



## 23న మంత్రివర్గ భేటీ

23న యాదగిరిగుట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

రెండోదశ ఇందిరమ్మ ఇళ్ల పథకం జూన్ 2 నుంచి ప్రారంభం

లబ్ధిదారుల ఎంపికలో విధివిధానాలు, మార్పులపై మంత్రివర్గంలో చర్చ

హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియ ముగియడంతో.. పనుల వేగవంతంపై కీలక నిర్ణయం



## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం కొత్త హెల్త్ స్కీమ్


మెరుగైన వైద్య సేవల కోసం కొత్తగా “ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్” ఏర్పాటు

అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ

కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను సమర్పించాలి

## భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

సెప్టెంబర్‌లో రానున్న రష్యా అధ్యక్షుడు



ధృవీకరించిన రష్యా అధ్యక్ష భవనం

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనున్న పుతిన్

ఏడాది వ్యవధిలో రెండోసారి భారత్‌కు

## దేశం భయంకరమైన ఆర్థిక సంక్షోభాన్ని చూడబోతోంది..

### మోదీ విధానాలపై రాహుల్ గాంధీ ఫైర్

మోదీ విదేశీ పర్యటనలపై విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ

దేశంపై పెద్ద ఆర్థిక తుపాను విరుచుకుపడుతుందని హెచ్చరిక

ఆర్థిక సంక్షోభం సామాన్యులనే దెబ్బతీస్తుందని వ్యాఖ్య

అదానీ, అంబానీలు, మోదీ ప్యాలెస్‌లో సురక్షితంగా ఉంటారని విమర్శ



ఢిల్లీ: దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ విదేశాల్లో పర్యటిస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో పర్యటించిన ఆయన చురువా హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా మిగతా..2లో

## 21వ తేదీన పూర్తిస్థాయి కేంద్ర మంత్రివర్గ సమావేశం

### బీజేపీ రాజకీయం.. కేంద్ర కేబినెట్‌లో సమూల మార్పులు?

మంత్రివర్గ విస్తరణ తథ్యమంటూ ఢిల్లీలో రాజకీయ చర్చలు

పార్టీతోపాటు ప్రభుత్వంలోనూ కొత్త సమీకరణాలకు బీజేపీ అధిష్టానం తెరలేపే అవకాశం



న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలకు అధికార బీజేపీ రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కీలకమైన ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగియడంతో మంత్రివర్గ విస్తరణ తథ్యమంటూ ఢిల్లీలో రాజకీయ చర్చలు జోరందుకున్నాయి. వచ్చే ఏడాది వివిధ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు, మిగతా..2లో

## నైజీరియాలో ఐసిస్‌పై వైమానిక దాడులు.. 175 మంది ఉగ్రవాదుల హతం



నైజీరియాలో అమెరికా, స్థానిక బలగాల సంయుక్త దాడులు

ఉగ్ర స్థావరాలు, ఆయుధ డిపోలు ధ్వంసం

ఇటీవలే ఐసిస్ సెకండ్ ఇన్ కమాండ్‌ను మట్టుబెట్టిన దళాలు

## రాష్ట్రంలో ఏఐతో చేపడుతున్న ప్రాజెక్టులపై డాక్యుమెంటేషన్..

### ప్రపంచ బ్యాంకు రుణానికీ ఏఐ కీలకం!

అంతర్జాతీయ సమావేశంలో వివరాల సమర్పణ




హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం విస్తృతమవుతోంది. వైద్య రంగంలోనూ ఏఐ ఆధారంగా అనేక ఆవిష్కరణలు వస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రానికి మంజూరు మిగతా..2లో

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

జనరల్ న్యూస్

గురువారం - 21 - మే - 2026

## తెలంగాణలో భగభగ: 47 డిగ్రీలకు చేరనున్న ఎండలు, పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

తెలంగాణ: తెలంగాణ అగ్నిగుండంలా మారుతోంది. రాష్ట్రంలో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరింది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి 47 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో నలుగురు మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు

మంగళవారం రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 19 జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఎండ తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌లో అత్యధికంగా 45.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నల్గొండ, నిర్మల్, సిద్దిపేట, మంచిర్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లో అనేకచోట్ల 45 డిగ్రీల మార్కును దాటింది. హన్మకొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల్లో 44-45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్ నగరంలోనూ ఎండ తీవ్రత 43 డిగ్రీలకు చేరింది.

రెడ్ అలర్ట్, వడగాల్పుల హెచ్చరిక

రానున్న రెండు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్, జనగామ, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45-47 డిగ్రీల మధ్య నమోదవుతాయని, ప్రజలు మధ్యాహ్నం వేళ ఇళ్లకే పరిమితం కావాలని సూచించింది. మరోవైపు నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో అక్కడ కూడా రెడ్ అలర్ట్ జారీ చేశారు.

ఎండవేడికి ప్రమాదాలు.. అకాల వర్షాలు

ఎండల తీవ్రతకు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు, గాలివాన బీభత్సం సృష్టించాయి. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో గాలివానకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో గాలి దుమారానికి ఇళ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ అకాల వర్షం కురిసింది.

వడదెబ్బతో నలుగురి మృతి

రాష్ట్రంలో మంగళవారం వడదెబ్బకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రైతు రాచర్ల రాజు (50), వికారాబాద్ జిల్లాకు చెందిన కార్మికుడు సామెల్ (35), ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కనక లచ్చు (52), శాంతినగర్‌కు చెందిన బిరుదుల కిరణ్‌కుమార్ (45) వడదెబ్బ తగిలి మృతి చెందారు.

## 23న మంత్రివర్గ భేటీ

హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 23వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. తొలుత ఈనెల 21న నిర్వహించనున్నట్లు ప్రభుత్వం జీవో విడుదల చేసినా.. అదేరోజు సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్నందున 23వ తేదీకి మంత్రిమండలి సమావేశాన్ని మార్చుతూ సర్కారు నిర్ణయం తీసుకుంది. 23న యాదగిరిగుట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో.. అదేరోజు అక్కడే క్యాబినెట్ భేటీ ఉంటుందనే ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వవర్గాలు మాత్రం హైదరాబాద్‌లోనే మంత్రివర్గ సమావేశం ఉంటుందని స్పష్టం చేశాయి. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. రెండోదశ ఇందిరమ్మ ఇళ్ల పథకం జూన్ 2 నుంచి ప్రారంభం కానుండటంతో.. లబ్ధిదారుల ఎంపికలో విధివిధానాలు, మార్పులపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియ ముగియడంతో.. పనుల వేగవంతంపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. భూముల విలువల్లో సవరణ, సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యోగులు, పింఛనుదారుల ఆరోగ్య కార్డులు, ఉద్యోగ నియామకాలు, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ, జర్నలిస్టుల ఇళ్లస్థలాల అంశాలను చర్చించే అవకాశాలున్నాయి. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నూతన సంక్షేమ కార్యక్రమాలు, పథకాల ప్రారంభంపై ఈ సందర్భంగా చర్చించనున్నట్లు తెలిసింది.

## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం కొత్త హెల్త్ స్కీమ్

హైదరాబాద్: ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా "ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్"ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఆర్థిక శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఐఎఫ్‌ఎంఐఎస్-హెచ్‌ఆర్ పోర్టల్లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సమాచారం నమోదు చేయాలని లేదంటే భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

ఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' మంగళవారం అధికారికంగా ధ్రువీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్-రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్-రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో ఈ వార్షిక సదస్సు జరుగుతుంది. భారత్ నేతృత్వంలో ఢిల్లీలో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో.. ప్రపంచ భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.

## నైజీరియాలో ఐసిస్‌పై వైమానిక దాడులు.. 175 మంది ఉగ్రవాదుల హతం

ఢిల్లీ: పశ్చిమాఫ్రికా దేశం నైజీరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఈశాన్య ప్రాంతంలో అమెరికా, నైజీరియా బలగాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడుల్లో 175 మందికి పైగా ఐసిస్ ఫైటర్లు హతమయ్యారు. ఈ విషయాన్ని నైజీరియా సైన్యం అధికారికంగా ధ్రువీకరించింది. నైజీరియా ఆర్మీ అధికార ప్రతినిధి సమైలా ఉబా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "యుద్ధ క్షేత్రంలో 175 మందికి పైగా ఐసిస్ మిలిటెంట్లు హతమయ్యారు" అని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఉగ్రవాదుల చెక్‌పోస్టులు, ఆయుధ డిపోలు, లాజిస్టిక్స్ కేంద్రాలతో పాటు వారికి నిధులు సమకూర్చే నెట్‌వర్క్‌ల ప్రధాన కార్యాలయాలను కూడా ధ్వంసం చేసినట్లు వివరించారు. కొన్ని నెలలుగా నైజీరియా, అమెరికా మధ్య సైనిక సహకారం గణనీయంగా పెరిగింది. గత వారం కూడా ఇరు దేశాల బలగాలు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో ఐసిస్ గ్లోబల్ సెకండ్-ఇన్-కమాండ్ అబు-బిలాల్ అల్-మినుకి హతమయ్యాడు. తీవ్రవాదంపై పోరాటంలో ఇది ఒక కీలక సహకారానికి నిదర్శనమని నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, తన ఆదేశాల మేరకు అమెరికా, నైజీరియా బలగాలు ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశాయని తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో తెలిపారు. లక్ష్యాలను గుర్తించడంలో, నిఘా సమాచారాన్ని సేకరించడంలో నైజీరియా బలగాలు కీలక పాత్ర పోషించాయని ఆఫ్రికామ్ కమాండర్ డాగ్విన్ ఆండర్సన్ వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, 2009 నుంచి బోకో హరామ్, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థల కారణంగా నైజీరియాలో 40,000 మందికి పైగా మరణించగా, 20 లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

## అందరి డేటా నా దగ్గర ఉంది

అమరావతి: అధికారం ఉందని పదిమందిని వెంటేసుకుని తిరగడం కాదు. అలా చేస్తే పార్టీ నిర్వీర్యమవుతుంది. పార్టీ కోసం పనిచేసేవారిని వదిలి.. మీ ఇళ్లలో ఉండేవారికి పదవులు ఇవ్వడం, ఆపై మీరే పెత్తనం చేయడం తగదు. కొన్ని క్లస్టర్లు, పంచాయతీల్లో పరిశీలిస్తే.. పార్టీ పరిస్థితి సీ గ్రేడ్‌కు పరిమితమైంది. అందరినీ కలుపుకొని పోవాలి. పార్టీలోనే ఉంటూ కొందరు అలకబూని ఇంట్లో ఉంటున్నారు. ఇది చాలా ప్రమాదకరం. ఎమ్మెల్యేగా రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలి. దురుసుతనం తగ్గించుకుని.. అందరితో కలిసి వెళ్లాలి' అని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి సీఎం చంద్రబాబు సూచించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం తుమ్మలపెంటలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 'రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరిలో కావలి ఎమ్మెల్యే 107వ స్థానంలో ఉన్నారు. అందరి డేటా నా దగ్గర ఉంది. కార్యకర్తలు కూడా రోడ్లపైకి రావాలి. ప్రతిపక్షంలో ఉంటేగానీ జ్ఞానోదయం కాదా? మహిళలకు సగభాగం రిజర్వేషన్లు అని చెబుతున్నా.. కార్యక్రమంలో మహిళలు తక్కువగా ఉండడమేంటి? ఈ ఏడాదిలోనే సహకార, స్థానికసంస్థల ఎన్నికలు జరుగుతాయి. వాటిలో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలి. 2019-24 మధ్యలో జరిగిన పాలనను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

మొదటి పేజి తరువాయి

"గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి కుట్రల వరకు వారిది విధ్వంసమే. ఆ విధ్వంసాన్ని సరిదిద్దడానికి మాకు 23 నెలలు పట్టింది. ఇప్పుడు రాష్ట్రం బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది" అని అన్నారు. రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నామని, రాయలసీమలో డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు, తిరుపతి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్ వస్తున్నాయని వివరించారు.

బీసీల సంక్షేమమే టీడీపీ డీఎన్ఏ

టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారని, వారికి దశాబ్దాల అనుబంధం ఉందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి రుణం తీర్చుకుంటామని చెప్పారు. చేనేతలకు, నాయీ బ్రాహ్మణులకు, వడ్డెర్లకు, గీత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి జీవన ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

"చేపలు పట్టడమే కాదు, వాటిని అమ్ముకోవడంలోనూ మత్స్యకారులకు అండగా ఉంటాను. మీ ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా, ప్రపంచవ్యాప్తంగా గిరాకీ సృష్టించేలా ఒక మార్కెటింగ్ మేనేజర్‌లా నేను వ్యవహరిస్తాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. చేపలు మంచి పౌష్టికాహారమని, ప్రోటీన్లు అధికంగా ఉండే ఈ ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని మన మత్స్యకారులకు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం వేటకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతతో, కొత్త ఆదాయ మార్గాలతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం, తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా, చేపల వేట నిషేధ కాలానికి గాను 1,30,796 మత్స్యకార కుటుంబాలకు, ఒక్కొక్కరికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి జమ చేశారు. సీఎం ప్రసంగిస్తుండగానే లబ్ధిదారుల ఫోన్లకు డబ్బులు జమ అయినట్లు సందేశాలు రావడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

మత్స్యకారుల హక్కులు, వనరులపై పూర్తి అధికారం

"ఈ తీరం మనది, ఈ బోటు మనదే, ఇక్కడి సంపద కూడా మనదే. ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదు," అని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా చెప్పారు. మన సముద్ర జలాల్లోకి పొరుగు రాష్ట్రాల బోట్లు వస్తే సహించేది లేదని, తీరప్రాంతంలో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులను కాపాడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండుగా ఉన్నాయని, ఆ నీటి వనరుల్లో చేపల పెంపకం చేసుకునే హక్కును మత్స్యకారులకే కట్టబెట్టామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిష్ సీడ్ అందించాలని మత్స్యశాఖను ఆదేశించినట్లు వెల్లడించారు. మత్స్యకారుల వేటను సులభతరం చేసేందుకు, 60 శాతం సబ్సిడీతో 200 కొత్త మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు సీవీడ్ సాగు

మత్స్యకార పురుషులతో పాటు, మహిళల ఆర్థిక సాధికారతకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మత్స్యకార, డ్వాక్రా సంఘాల మహిళలకు అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో 'సీవీడ్' (సముద్రపు నాచు) సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దీని ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతామని ఆయన హామీ ఇచ్చారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన సీవీడ్, తీరప్రాంత నిఘా కేంద్రం స్టాళ్లను ఆయన సందర్శించి, అధికారుల పనితీరును అభినందించారు.

అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన

తీరప్రాంత అభివృద్ధిలో మత్స్యకారులను భాగస్వాములను చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నామని, దీని ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలోని 25 మత్స్యకార గ్రామాలను కలుపుతూ మెటల్ రోడ్లు నిర్మిస్తామని, నార్త్ బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీతకు రూ. 6.19 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటుతో స్థానికులకే ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

## ప్రాజెక్టుల భూసేకరణనూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి

మొదటి పేజి తరువాయి

భూసేకరణలో జాప్యం జరగకుండా తక్షణమే బిల్లుల చెల్లింపులు జరిగేలా చూస్తామన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమై సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికి కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై సంబంధిత జిల్లాధికారులతో జిల్లా మంత్రులు సమీక్షించి పనుల్లో పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు.

1226 గ్రామాలకు తాగునీరు : మంత్రి ఉత్తమ్

పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు తొలిదశ కింద నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 1226 గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రతిష్టాత్మక పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు అనుబంధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని కరువు పీడిత జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు తాగునీరు, పారిశ్రామిక నీటి సరఫరా అందిస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం జిల్లా ప్రాజెక్టులపై సచివాలయంలోఉత్తమ్ సమీక్షించారు. ప్రాధాన్యతలను పున:సమీక్షించడానికి, పనులను వేగవంతం చేయడానికి పక్షం రోజుల్లోగా మరోసారి జిల్లా ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని జిల్లా ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

జూరాల పూడిక తొలగింపు

గత బీఆర్ఎస్ పాలనలో పాలమూరు ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ అన్నారు. పూడికతో జూరాల ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 8 టీఎంసీల కంటే తగ్గిపోయిందన్నారు. జలాశయాల పునరుద్ధరణకు కేంద్రం అమలు చేస్తున్న 'డ్రిప్'పథకం కింద జూరాల ప్రాజెక్టును చేర్చి ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర జలశక్తి శాఖకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. డ్రిప్ కింద పూడికతీతతోపాటు ప్రాజెక్టు భద్రత, నిల్వ సామర్థ్యం, నిర్వహణ మెరుగు అవుతుందని తెలిపారు.

## 21వ తేదీన పూర్తిస్థాయి కేంద్ర మంత్రివర్గ సమావేశం

2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీతోపాటు ప్రభుత్వంలోనూ కొత్త సమీకరణాలకు బీజేపీ అధిష్టానం తెరలేపే అవకాశముందని సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈనెల 21వ తేదీన పూర్తిస్థాయి కేంద్ర మంత్రివర్గ సమావేశం జరగనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ పథకాల అమలు, వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై రేపటి కేబినెట్ సమావేశంలో సమీక్ష జరగనుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అస్సాంలో మెరుగైన ఫలితాలు సాధించడం, పుదుచ్చేరిలో ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. 2027లో ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త మంత్రివర్గం, పార్టీ జాతీయ బృందం రూపుదిద్దుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. యువత, మహిళల్లో కొత్త వారికి అవకాశం కలి?పస్తూ, కొంతమంది సీనియర్ నేతలను పార్టీ సంస్థాగత బాధ్యతలకు అప్పగించేలా కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాని రెండోసారి అధికారం చేపట్టాక 2.0 ప్రభుత్వంలో 2021 జూలైలో కేబినెట్‌లో భారీ మార్పులు చేపట్టారు. మొత్తం 12 మంది మంత్రులను తప్పించారు. కొత్తగా 36 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు.

## దేశం భయంకరమైన ఆర్థిక సంక్షోభాన్ని చూడబోతోంది..

మీడియాతో మాట్లాడారు. దేశంలో సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని.. ప్రజలను బయటకు వెళ్లొద్దని ప్రధాని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయనేమో ప్రపంచమంతా చుట్టేస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. ముందుముందు దేశంపై ఒక పెద్ద ఆర్థిక తుపాను విరుచుకుపడబోతోందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. "రాబోయే ఆర్థిక సంక్షోభం అదానీ, అంబానీ, మోదీని ఏమీ చేయలేదు. వాళ్లంతా తమ ప్యాలెస్‌లలో భద్రంగా ఉంటారు. కానీ దేశ యువత, సామాన్య ప్రజలు దీనివల్ల తీవ్రంగా దెబ్బతింటారు. ఇంతకుముందెన్నడూ చూడని భయంకరమైన ఆర్థిక సంక్షోభాన్ని దేశం చూడబోతోంది. కష్టకాలం ముందుంది. మోదీ ఆర్థిక విధానాలే ఇందుకు కారణం" అని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధాని మోదీ ఐదు దేశాల దౌత్య పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఇటలీ చేరుకోనున్నారు. అంతకుముందే ఆయన యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే దేశాల పర్యటనలను పూర్తి చేసుకున్నారు. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా దేశం రానున్న రోజుల్లో తీవ్ర సంక్షోభం ఎదుర్కోనుందని మోదీ ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని సూచించారు. బంగారం కొనొద్దని, ప్రజా రవాణాను వినియోగించుకోవాలని, వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ తాజాగా ఆయన్ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేశారు.

## రాష్ట్రంలో ఏఐతో చేపడుతున్న ప్రాజెక్టులపై డాక్యుమెంటేషన్..

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో రాష్ట్రానికి మంజూరు చేయనున్న రుణంలో కృత్రిమ మేధ సాంకేతికతను ఏ మేరకు వినియోగిస్తున్నారన్న అంశానికి ప్రపంచ బ్యాంకు ప్రాధాన్యం ఇవ్వనుంది. తాజాగా జకార్తాలో 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ రెస్పాన్సిబుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ పీపుల్ సెంటర్డ్ హెల్త్' అనే అంశంపై అంతర్జాతీయ సమావేశం జరగ్గా.. 17 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనరేట్ అధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఏఐ సాంకేతికతతో ఏయే ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోంది, భవిష్యత్తులో ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆరోగ్య రంగంలో సేవలను ఎలా మెరుగుపరచనున్నారో ఈ సమావేశంలో పాల్గొన్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు రాష్ట్ర అధికారులు వివరాలు అందజేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు ప్రపంచ బ్యాంకు రూ.4,500 కోట్ల వరకు రుణం అందించేందుకు ఆమోదం తెలిపింది. ట్రామా, క్యాన్సర్ కేర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం లాంటి అంశాలతో డీపీఆర్ సిద్ధం చేసి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు సమర్పించారు. అయితే, రుణం మంజూరు కావడానికి వరల్డ్ బ్యాంకు అనేక అంశాలను పరిగణిస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ 'ఏఐ'ని ఎంత సమర్థంగా వినియోగిస్తోందన్న అంశానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు మనం చేపడుతున్న ఏఐ ఆధారిత ప్రాజెక్టుల గురించి వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లంగ్ క్యాన్సర్‌ను కృత్రిమ మేధ ద్వారా గుర్తించి సర్కారు ఆసుపత్రుల్లో నాణ్యమైన చికిత్స అందించే కార్యక్రమం చేపట్టనున్నారు. రాష్ట్రంలో నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ జబ్బుల తీవ్రత అధికంగా ఉంది. దీని కట్టడికి కృత్రిమ మేధ వినియోగించి ఆరోగ్య సేవలను పెంచాలని సర్కారు నిర్ణయించింది. గర్భిణుల్లో వచ్చే సమస్యలు, మరణాలు తగ్గించేందుకు ఏఐ ఆధారంగా ప్రభుత్వం ఓ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఆయా ప్రాజెక్టుల వివరాలను అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు అందజేశారు. కృత్రిమ మేధ ద్వారా చేపడుతున్న ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంకు ప్రాధాన్యం ఇస్తోందని జకార్తా సమావేశానికి హాజరైన కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనరేట్‌లోని ఎన్‌హెచ్‌ఎం విభాగం చీఫ్ ఐటీ అధికారి మంజునాథ్ నాయక్ తెలిపారు. రుణంలో మొదటి విడత నిధులు అందడానికి మరో కీలక సమావేశం జరగాల్సి ఉందని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

## ఒప్పందం కుదరకుంటే విరుచుకుపడతాం



వాషింగ్టన్: పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. "ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుంది" అని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు.

మమ్మల్ని ఓడించడం సాధ్యం కాదు
-ఇరాన్

అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమీనియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది.


ట్రంప్, నెతన్యాహులను హతమారిస్తే రూ.560 కోట్లు!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యుద్ధంతో జీవ వైవిధ్యానికి దెబ్బ

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రిఫైనరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వన్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి.

## కేంద్రంలో బీజేపీ రాజ్యం కూలబోతోంది: మమత హెచ్చరిక



కోల్‌కత్తా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీని త్వరలోనే కేంద్రంలో అధికారం నుంచి తొలగిస్తామని మమత చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో బెంగాల్‌లో సువేందు ప్రభుత్వం మైనార్టీ వర్గాలను లక్ష్యంగా చేసుకుందని.. వారి ఇళ్లను, దుకాణాలను అన్యాయంగా కూల్చివేస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం మమతా బెనర్జీ తన నివాసంలో టీఎంసీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ..'పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం మైనారిటీ వర్గాలను, రోడ్డు పక్కన దుకాణాలు నడిపేవారిని లక్ష్యంగా చేసుకుంటోంది. మైనారిటీ వర్గాలను టార్గెట్ చేస్తున్నారు. దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. ఈ ప్రభుత్వం మన రాజ్యాంగ భావనలు, విలువలతో చెలగాటం ఆడుతోంది. దేశాన్ని పాలిస్తున్న జాతీయ ప్రజాస్వామ్య కూటమికి నాయకత్వం వహిస్తున్న బీజేపీ, సమీప భవిష్యత్తులో కేంద్రంలో అధికారాన్ని కోల్పోతుంది. రాబోయే రోజుల్లో ఢిల్లీలో బీజేపీని అధికారం నుంచి తొలగిస్తారు' అంటూ ఘాటు విమర్శలు చేశారు. అలాగే.. తాను, తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఎలాంటి బెదిరింపులకు లొంగబోనని స్పష్టం చేశారు. ఇక, మమతా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా హాజరయ్యారు. దక్షిణ కోల్‌కతాలోని తన ఇంటిలోని అనధికార కట్టడాలను కూల్చివేయాలని కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) పంపిన నోటీసుపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ..'వారు ఏం చేయాలనుకున్నా చేయనివ్వండి... నా ఇంటిని కూల్చివేయండి, నాకు నోటీసు పంపండి. నేను ఈ విషయాలకు తలవంచను. మన రాష్ట్రానికి చాలా మంది ముఖ్యమంత్రులు ఉన్నారు, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి లాంటి వారు ఎవరూ లేరు. కెమెరా ముందు డబ్బులు తీసుకుంటూ(2014లో వివాదాస్పద నారద స్టింగ్ ఆపరేషన్) కనిపించిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేశారు. ఏది ఏమైనప్పటికీ, బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుంది అంటూ వ్యాఖ్యలు చేశారు. అయితే, కూల్చివేత నోటీసు పంపిన కేఎంసీ ఇప్పటికీ టీఎంసీ నియంత్రణలోనే ఉందని, మమతకు సన్నిహితుడిగా భావించే ఆ పార్టీ ఎమ్మెల్యే ఫిర్హాద్ హకీం కోల్‌కతా మేయర్‌గా ఉన్నారని ఇక్కడ ప్రస్తావించడం గమనార్హం.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# మొక్కజొన్న,వడ్ల కొనుగోలో మాయ జాలమే

**- ధళారీలకు కొమ్ము కాస్తున్న మద్దులపల్లి మార్కెట్ కమిటీ యంత్రాంగం**

ఖమ్మం, నేటి శుభోదయ ::: మొక్కజొన్న, వరి ధాన్యం కోనుగోలు విషయంలో పెద్ద మాయాజాలం జరుగుతుంది అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా, పాలేరు నియోజక వర్గంలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల పనిచేస్తున్న అధికార యంత్రాంగం కారణంగా అధికార పార్టీ కాంగ్రెస్, ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెడ్డ పేరు వస్తోంది. ఇక్కడ రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన మొక్కలు, ధాన్యం విషయంలో దళారుల వ్యవస్థ రాజ్యం ఏలుతున్నారనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. దళారులు ఊర్లో లో కొనుగోలు చేసిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని బినామీ పేర్లతో రైతుల పేర్లతో పెద్ద ఎత్తున మోసం చేస్తున్న కనీసం పట్టించుకోక పోవడం శోచనీయం. మరోవైపు అనేక గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో దళారులకు అమ్మేసి చేతులు దులుపుకున్నారు. కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లింపులు విషయంలో కూడా తీవ్ర జాప్యం చేస్తున్నారు.మొక్కజొన్న,వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాల్సిన అధికారులు స్పందించక పోవడం తో దళారీలను ఆశ్రయించన సందర్భాలు కూడా ఉన్నాయి. వారిని కట్టడి చేయాలని, మద్దతు ధర చెల్లించాలని,కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ ఏడాది వందలాది మంది రైతులు మొక్కజొన్న , వరి ధాన్యాన్ని పండించారు. కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న అవకతవకలపై గత నెల రోజులుగా రైతాంగం ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శ లేకపోలేదు. ప్రభుత్వం సకాలంలో వరిధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయకపోవడం వలన కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించకపోవడం వలన వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు లభో దిభో అంటున్నారు. అకాల వర్షాలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణమే పంటలు కొనుగోలు చేయాలని,దళారీలను అరికట్టాలని,కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించాలని,తడిసిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తరుగు పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని,కళ్ళాల్లో ఉన్న ధాన్యానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.లేనియెడల రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్పందించడంతో పలువురు అధికారులు జోక్యం చేసుకోని సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతోనే సరి పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ లో జరుగుతున్న అక్రమాలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి

# సొంత గూటికి చేరుతున్న బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు

**- రెండున్నర ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజా వ్యతిరేకతతో తిరిగి సొంతగూటికి చేరుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు**



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ ఫిర్ ఆయేగే, ఇందిరమ్మ రాజ్యం బారాబర్ జాయేగా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది ఇప్పుడు ఖమ్మం నగరంలో ఏ మూలన చూసిన ఇదే హాట్ టాపిక్ గా మారుతోంది. పువ్వాడ విల్ కమ్, కాంగ్రెస్ ఖతం అని చెప్పక తప్పదు అంటున్నారు జనం. ప్రజలు కేసీఆర్ బాపు సర్కార్ కోసం ఎదురు చూస్తున్నారు . హోరెత్తిన నినాదాలతో దద్దరిల్లిన 44 డివిజన్ లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బ్రహ్మ రథం పట్టారనే గుస గుస లాడుతున్నారు. పువ్వాడ అజయ్ కుమార్ కి ఈ బ్రహ్మరథం పట్టిన 44 డివిజన్ ప్రజలతో పాటు అనేక డివిజన్ లో అభివృద్ధి ప్రదాత ను ఓడించి పెద్ద తప్పు చేశామని మరోసారి ఇలాంటి తప్పు చేయబోమని చెప్పడం కొసమెరుపు. మంగళవారం ఖమ్మం 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ లోకి చేరిన కార్యకర్తలు పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు అక్కడి జనం స్వాగతం పలికిన తీరు చూస్తే ఇప్పుడు ఎన్నికలు జరుగుతే పువ్వాడ అజయ్ కుమార్ బఫర్ మెజారిటీతో విజయం సాధించాడం ఖాయం అని చెప్పక తప్పదు. ఇదే స్ఫూర్తితో నేడు అదే బాటలో కాంగ్రెస్ నుంచి వలస వస్తున్న కార్యకర్తల తీరు పట్ల ఆ పార్టీ లో మంచి జోష్ నింపింది.-ార్టీలో చేరికలతో బిఆర్ ఎస్ శ్రేణుల్లో పెరిగిన నయా జోష్ ఊపుతో రానున్న ఎన్నికల్లో విజయం తమదే అనే ధీమాతో బిఆర్ ఎస్ క్యాడర్ లో మంచి ఉత్సాహం నింపింది. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిన మా యువ నేత, మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ తోనే మా ప్రయాణం అంటూ పెద్ద పెట్టున నినాదాలతో హోరెత్తించారు. భవిష్యత్తులో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఇక్కడే తనకు ఉన్న సమయాన్ని పార్టీ, కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రుల తీరు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఆ పార్టీ నేతలపై చేసిన వ్యాఖ్యలతో ఆ పార్టీ లో అనేక చోట్ల అలజడి మొదలైంది. ఇటీవల చర్ల మండలం కాంగ్రెస్ పార్టీ రెండు ముక్కలైన సంఘటన ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అదే తీరు అనేక చోట్ల ఆ పార్టీ అనేక గ్రూపులుగా చీలి పోయే ప్రమాదం లేకపోలేదు. ప్రధానంగా ఖమ్మం అసెంబ్లీ నియోజక పరిధిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అతని కుమారుడు తుమ్మల యుగంధర్ ల మధ్య సఖ్యత లేకపోవడం వల్ల ఆ పార్టీ క్యాడర్ లో గందరగోళం నెలకొంది. తండ్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజాప్రతినిధులకు గౌరవం ఇస్తే, కొడుకు తుమ్మల యుగంధర్ రెండో రకం క్యాడర్ ను వెంట పెట్టుకొని కార్యక్రమాలు చేసేస్తున్నారనే అపవాదు మూటకట్టుకున్న వైనం ఆ పార్టీకి పెద్ద నష్టం చేయడం ఖాయమని మేధావి వర్గం చెప్పడం కొసమెరుపు. ఇలా అయితే ఖమ్మం ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పట్ల ఇప్పటికే ఆ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. అధిష్టానం కూడా ఖమ్మం ఉమ్మడి జిల్లాపై దృష్టి సారించాక పోతే అధికార పార్టీ కాంగ్రెస్ కు పెద్ద నష్టం వాటిల్లడం ఖాయమని చెప్పక తప్పదు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన వర్గీలకు మాత్రమే పదవులు పంపకం జరుగుతుంది తప్ప మిగతా వారికి, నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేసిన వారికి ఎలాంటి పదవులు రాకపోవడంతో వారంతా తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇప్పటికే ఆ పార్టీ లో బలమైన వర్గం ఇగ మనకు పదవులు రావటం కష్టమే అని తీవ్ర మానసిక శోభకు గురి చేస్తోంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం తనకు అనుకూలంగా ఉన్న ఒకరు, ఇద్దరూ, ముగ్గురు మినహా మిగిలిన వారికి కనీసం న్యాయం చేయలేని పరిస్థితిలో ఉన్నారు అనే గుస గుసగుసలు వినిపిస్తున్నాయి. కనీసం ఎవరికైనా కష్టం వస్తే కనీసం భరోసా గా ఫోన్ కూడా చేయరు అనే అపవాదు లేకపోలేదు. క్యాడర్ ఎదురుగా వచ్చి నమస్తే పెట్టిన కనీసం పలకరింపు లేకపోవడం, కనీసం పేరు పెట్టి పిలిసిన సందర్భం కూడా మంత్రి తుమ్మల వద్ద లేదు అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పునరాలోచన చేసి సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్ళితే అధికార పార్టీ కాంగ్రెస్ కు భవిష్యత్తు ఉంటుంది లేకపోతే భవిష్యత్తులో ఘోర పరాభవం ఎదురుకోక తప్పదు మరి.

# మిని ఫైర్ ఇంజన్‌కు శ్రీరాం 'తాతయ్య అదిరిపోయే ఆలోచన

**- కేవలం 30 వేలకే 'విప్లవాత్మక' ఐడియా**

**- వత్సవాయి మండలం, దబ్బాకుపల్లి రైతు కన్నీరు చూసి చలించిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రాష్ట్రమంతా వాడదగ్గ అద్భుత ఆవిష్కరణ సక్సెస్**

**- దబ్బాగుపల్లి గ్రామం ను ముంచేసిన అగ్ని విషాదం**

అమరావతి, నేటి శుభోదయ ::: కష్టం వస్తే కుంగిపోవడం కాదు. ఆ కష్టంలోంచి ఒక సరికొత్త చరిత్రకు, ప్రజా ఉపయోగకర ఆవిష్కరణకు ప్రాణం పోయడమే నిజమైన నాయకత్వం.జగ్గయ్యపేట నియోజకవర్గ చరిత్రలోనే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే నిలిచిపోయే ఒక వినూత్న ప్రయోగానికి జగ్గయ్యపేట మున్సిపాలిటీ వేదికైంది. జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) చేసిన ఒక అద్భుతమైన ఆలోచన ఇప్పుడు యావత్ రాష్ట్రానికే ఒక సరికొత్త దిక్సూచిగా మారబోతోంది.

### - కలచివేసిన దబ్బాగుపల్లి అగ్నిప్రమాదం

సరిగ్గా మూడు రోజుల క్రితం, జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని దబ్బాగుపల్లి గ్రామంలో ఊహించని విధంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చూస్తుండగానే అగ్నికీలలు ఎగసిపడ్డాయి. రైతులు ఎంతో కష్టపడి, చెమటోడ్చి పండించిన సుమారు 70 ఎకరాల మొక్కజొన్న, ఇతర తోటల పంటలు అగ్నికి ఆహుతైపోయాయి. కళ్లముందే పంట బూడిదవుతుంటే రైతులు ఏం చేయాలో పాలుపోక ఆవేదనతో అల్లాడిపోయారు.

### - హుటాహుటిన రంగంలోకి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

ఈ దారుణ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే, జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధి, నిరంతరం ప్రజల గుండె చప్పుడెరిగిన నాయకుడు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఏమాత్రం ఆలస్యం చేయకుండా, హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల్లో కాలిపోతున్న పొలాలను, రైతుల కన్నీళ్లను ఆయన స్వయంగా చూశారు. సర్వస్వం కోల్పోయిన రైతులను ఓదారుస్తూ వారిలో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు.

### సమస్య మూలాలు - వ్యవస్థలోని లోపాలు ఎమ్మెల్యే ఆవేదన

ఘటనా స్థలంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నప్పుడు ఒక చేదు నిజం వెలుగుచూసింది. అగ్నిప్రమాదం జరిగింది వాస్తవమే, కానీ ఫైర్ ఇంజన్ గనుక మరికొంత ముందే (సకాలంలో) వచ్చి ఉంటే నష్టం చాలా తక్కువగా వాటిల్లేదని, తమ పంటలు కళ్లముందే బూడిదయ్యేవి కావని రైతులు కన్నీరుమున్నీరవుతూ ఎమ్మెల్యే వద్ద బాధపడ్డారు.

### వ్యవస్థాగత సమస్య, ఒకే ఒక్క ఫైర్ ఇంజన్

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 72 గ్రామాలు ఉన్నాయి. ఇంత పెద్ద నియోజకవర్గానికి ప్రభుత్వ రికార్డుల ప్రకారం అందుబాటులో ఉన్న ఫైర్ ఇంజన్ కేవలం ఒకటంటే ఒక్కటే. దబ్బాగుపల్లిలో ప్రమాదం జరిగిన ఆ దురదృష్టకర సమయంలో, ఆ ఏకైక ఫైర్ ఇంజన్ నియోజకవర్గంలోని మరో సుదూర ప్రాంతంలో అగ్నిప్రమాద విధుల్లో ఉంది. అక్కడ పని ముగించుకుని దబ్బాగుపల్లికి వచ్చేసరికి చాలా సమయం పట్టింది. ఈ లోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.రైతుల ఆవేదన, వ్యవస్థలో ఉన్న ఈ భౌగోళిక ఇబ్బంది ఎమ్మెల్యే మనసును తీవ్రంగా కలచివేసింది. "ప్రమాదం జరిగినప్పుడు కోటి రూపాయల ఫైర్ ఇంజన్ ఎక్కడో దూరం నుంచి వచ్చే లోపు రైతుల జీవితాలు బుగ్గిపాలు కావాలా? దీనికి ఏదో ఒక శాశ్వత పరిష్కారం కనిపెట్టాలి" అని ఆయన గట్టిగా నిశ్చయించు కున్నారు.జగ్గయ్యపేట మున్సిపల్ అధికారులు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి ఎమ్మెల్యే అత్యవసర మేధోమథనానికి తెరతీశారు.

### విప్లవాత్మక ఆలోచన, రూ. కోటి వర్సెస్ రూ. 30 వేలు

ఈ మేధోమథనంలో నుంచే ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మనస్సులో ఒక అద్భుతమైన, వినూత్నమైన ఆలోచన మొలకెత్తింది. సాధారణంగా ప్రభుత్వం ఒక కొత్త ఫైర్ ఇంజన్ కొనాలంటే సుమారు కోటి రూపాయల వరకు ప్రజాధనం ఖర్చవుతుంది. అంత బడ్జెట్ ప్రతి గ్రామానికి పెట్టడం ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాని పని.

### - గ్రామాల్లో ఉన్న వనరుల పైనే ఫోకస్

కానీ, మన నియోజకవర్గంలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ, ప్రతి పెద్ద పంచాయతీలోనూ మంచినీటి సరఫరా కోసం వాటర్ ట్యాంకర్లు, వాటిని లాగడానికి ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని ఎమ్మెల్యే గమనించారు. "ఈ మంచినీటి ట్యాంకర్లనే మనం విపత్తు సమయంలో ఫైర్ ఇంజన్లుగా ఎందుకు మార్చకూడదు?" అనే ఆలోచనే ఈరోజు ఒక విప్లవానికి నాంది పలికింది.

### - రూ. 30 వేలకే మినీ ఫైర్ ఇంజన్ టెక్నాలజీ

ఎమ్మెల్యే ఐడియా ప్రకారం ప్రతి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకర్‌కు ప్రత్యేకంగా ఒక హై-ప్రెషర్ మోటార్, ఫైర్ ఇంజన్ నాజిల్ ఏర్పాటు చేయాలి. దీనికి అయ్యే ఖర్చు కేవలం రూ. 30,000 (ముప్పై వేల రూపాయలు) మాత్రమే! ప్రమాదం జరిగిన వెంటనే, పెద్ద ఫైర్ ఇంజన్ వచ్చే వరకు ఆగకుండా, ఈ లోకల్ ట్యాంకర్ల ద్వారా మంటలను ప్రాథమికంగా అణచివేసేందుకు 'ఫస్ట్ ఎయిడ్' (ప్రథమ చికిత్స) లాగా వాడుకోవచ్చు.

### - చెరువు బజార్‌లో ప్రత్యక్ష ప్రయోగం (ట్రయల్ రన్)

ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జగ్గయ్యపేట మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన ఒక వాటర్ ట్యాంకర్‌కు ఈ మోటార్, నాజిల్ సిస్టమ్‌ను అమర్చారు. ఈరోజు జగ్గయ్యపేట పట్టణంలోని స్థానిక చెరువు బజార్‌లో దీనికి సంబంధించిన ప్రత్యక్ష ప్రయోగాన్ని (ట్రయల్ రన్) నిర్వహించారు.ఈ ప్రయోగంలో ఒక అద్భుతమైన విషయం తేలింది. కోటి రూపాయల సాధారణ ఫైర్ ఇంజన్ 25 మీటర్ల రేంజ్ వరకు నీటిని చిమ్మితే, కేవలం 30 వేల రూపాయలతో తయారు చేసిన ఈ మోడిఫైడ్ ట్యాంకర్ ఏకంగా 15 మీటర్ల రేంజ్ వరకు అత్యంత వేగంగా, హై-ప్రెషర్‌తో నీటిని కొట్టింది. ఈ ట్రయల్ రన్ వందకు వంద శాతం అద్భుతంగా విజయవంతమైంది.

**- భవిష్యత్తు విజన్ - ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి 'జగ్గయ్యపేట మోడల్'**

ఈ ప్రయోగం విజయవంతం కావడంతో నియోజకవర్గ ప్రజల్లో, రైతుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.దబ్బాగుపల్లి రైతుల కష్టం నుంచి పుట్టిన ఈ సరికొత్త ఆలోచన కేవలం జగ్గయ్యపేటకే పరిమితం కాకూడదు. ఇది రేపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి, రాష్ట్ర ప్రజలందరికీ ఉపయోగపడే ఒక అద్భుత ఆవిష్కరణ.అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించడానికి ఇది ఒక రామబాణంలా పనిచేస్తుంది. ఒక ఊరిలో ప్రమాదం జరిగితే చుట్టుపక్కల ఊర్ల నుంచి హుటాహుటిన నాలుగైదు ట్యాంకర్లను నిమిషాల వ్యవధిలో రప్పించవచ్చు. దీనివల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం, పంట నష్టం చాలా వరకు తగ్గుతుంది అని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.

### - సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి జగ్గయ్యపేట ఫార్ములా

ఈ అద్భుతమైన 'జగ్గయ్యపేట మోడల్' ఆలోచనా విధానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, యువ నాయకులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి త్వరలోనే అధికారికంగా వివరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ ఈ విధానాన్ని అవలంబించేలా, అవసరమైతే ఒక ప్రత్యేక ఇంజనీరింగ్ బృందాన్ని ఏర్పాటు చేసి ఈ టెక్నాలజీని మరింత డెవలప్ చేసి జీవో జారీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.ఇవాళ జరిగిన ఈ చారిత్రాత్మక ట్రయల్ రన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, టెక్నికల్ సిబ్బంది అంతా పాల్గొన్నారు. ఎమ్మెల్యే అద్భుతమైన ఐడియాను, సమయస్ఫూర్తిని వారంతా ముక్తకంఠంతో కొనియాడారు.రైతుల పాలిట అపర భగీరథుడిలా, ప్రజా పక్షపాతిగా నిలిచి, కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని ఆదా చేస్తూనే ప్రజలకు రక్షణ కల్పించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పై నియోజకవర్గ ప్రజలు, రైతాంగం ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# "పేదల పెన్నిధిగా నిలిచిన జనసేన :ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం మే 20 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: పేద ప్రజల పెన్నిధిగా జనసేన పార్టీ ఉంటుందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం రాజానగరం నియోజవర్గం రాజానగరం మండలం సూర్యపేట గ్రామానికి సంబంధించిన ఇద్దరు చిన్నపిల్లలు లోక్షితాదేవి,దీపిక, వీళ్ళ తల్లి చనిపోయారు. ఈ చిన్న పిల్లలు అనాధలు అయ్యారు. వీళ్ళ అమ్మమ్మ దగ్గరే ఉంటున్నారు. ఆర్థికంగా కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కుటుంబం విషయం తెలుసుకున్న గల్ఫ్ జనసేన కమ్యూనిటీ గ్రూప్ జనసైనిక సభ్యులు మరియు కూటమి నాయకులు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తమ వంతుగా ఈ పిల్లలకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు .గల్ఫ్ జనసేన పార్టీ సభ్యులు అందించిన రూ. 50,000/-రూపాయలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పేద ప్రజల కష్టసుఖాల్లో భాగం పంచుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన శ్రామికులు జనసేన అధ్యక్షులు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు గల్ఫ్ దేశంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గల్ఫ్ జనసేనకు ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లిదండ్రులు లేని ఈ బాలలకు జనసైనికులు అందరూ కలిసి రూ.50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించటం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి,ప్రజల సేవ లక్ష్యం గా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పుల్లా బాబి, ఘంటా సుబ్రహ్మణ్యం, కామిశెట్టి శ్రీనివాస్, అడ్డగర్ల సురేష్, నల్లగంచి రాంబాబు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

**-మచిలీపట్నం, ఉయ్యూరు,గుడివాడ**

**డివిజన్ పరిధిలోని వినియోగదారులు సద్వినియోగించుకోవాలి**

గుడివాడ, మే 20( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 21వ తేదీన ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు మచిలీపట్నం పోతేపల్లి రోడ్డు లోని జ్యూవెలరీ ఫంక్షన్ హాల్ నందు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్వర్యం లో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ పి. రవీంద్ర బాబు తెలిపారు.వినియోగదారులు విద్యుత్ సరఫరా లోపాలు, విద్యుత్ బిల్లులలో లోపాలు వంటి సమస్యలపై విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్ పర్సన్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామన్నారు.వారి తొపాటు సిజి ఆర్ ఎఫ్ సభ్యులు హాజరు అవుతారు. కృష్ణాజిల్లా పరిధిలోగల మచిలీపట్నం, ఉయ్యూరు మరియు గుడివాడ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 'ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం'

**- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**

**- కోరుకొండ తన కార్యాలయంలో స్వయంగా అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే 'బత్తుల'.. - కార్యాలయానికి పోటెత్తిన నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు.. - ప్రతి ఒక్కరి సమస్యను ఓపిగ్గా విని, తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే..!!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా ప్రజల చెంతనే అందుబాటులో ఉంటున్నారు. ఇందులో భాగంగా కోరుకొండలోని కార్యాలయంలో అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకుంటున్నారు. మంగళవారం ఉదయం నుంచే కోరుకొండ కార్యాలయానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు, జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యాలయానికి విచ్చేసిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే 'బత్తుల' సాదరంగా ఆహ్వానించి, వారి వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను, వ్యక్తిగత ఇబ్బందులను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు.నియోజకవర్గ పరిధిలోని మౌలిక వసతులు, తాగునీటి ఎద్దడి, అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మరియు పింఛన్లు, రేషన్ కార్డుల వంటి పలు సామాజిక సమస్యలపై ప్రజల నుండి ఎమ్మెల్యే స్వయంగా అర్జీలను (వినతిపత్రాలను) స్వీకరించారు. ప్రజా దర్బార్ తరహాలో సాగిన ఈ కార్యక్రమంలో అర్జీలు సమర్పించిన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన న్యాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.ప్రజలు సమర్పించిన అర్జీలపై ఎమ్మెల్యే 'బత్తుల' తక్షణమే స్పందించారు. పలు తీవ్రమైన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, త్వరితగతిన క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, ఆయా సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. రాజానగరం నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా ప్రధాన సంకల్పం. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా పనిచేస్తోంది. ప్రజలు తమ సమస్యల నివృత్తి కోసం ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా నన్ను సంప్రదించవచ్చు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఒక బాధ్యతగా తీసుకుని, పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షిస్తామన్నారు..కార్యాలయంలో ఎమ్మెల్యే తమకు అందుబాటులో ఉంటూ, తమ సమస్యలను ఓపికగా విని, అర్జీలు స్వీకరించడం పట్ల నియోజకవర్గ ప్రజలు, కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# "జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి విబిజి రాంజీ పథకాన్ని రద్దు చెయ్యాలి




సిఐటియు నాయకులు డిమాండ్"పెంటపాడు మే 20 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ)::: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, కొత్తగా తీసుకువచ్చిన విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని, ఉపాధి కూలీలకు ఎండ తీవ్రంగా ఉన్నది కాబట్టి మజ్జిగ, చల్లని మంచినీళ్లు అందించాలని సిఐటియు నాయకులు సిరవరపు రంగారావు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005 సంవత్సరం లో కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు సభ్యులు 63 మంది పోరాటం ఫలితంగా యూపిఏ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు, వ్యవసాయ కార్మికులకు, రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చారని, ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి 100 రోజులు పనులు తగ్గకుండా ఉపాధి కల్పించారని కానీ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని తీసేసి జిరాంజి పేరుతో మరొక పథకాన్ని తీసుకురావడం పేదలకు, వ్యవసాయ కూలీలకు, రైతులకు నష్టం చేకూరుస్తుందని వారు వాపోయారు. ఉపాధి పనులు పర్యటన భాగంగా పెంటపాడు మండలం ముదునూరు గ్రామంలో వారు పర్యటించి ఉపాధి కూలీలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో వేసవికాలంలో వడదెబ్బలు తగలకుండా షామియానా, మజ్జిగ, మంచినీళ్ల లాంటి సౌకర్యాలు ఉండేవని అవన్నీ తీసేసారని ఆవేదన వ్యక్తం చేశారు. మరల పునద్దరించాలని వారు ఉపాధి కూలీలతో నినాదాలు చేశారు. అలాగే కేంద్ర బిజెపి ప్రభుత్వం చేసిన చట్టాల్ని ఖండించకుండా వెంటనే రాష్ట్రంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయడాన్ని వారు ఖండించారు. పాత చట్టంలో కల్పించాల్సిన 100 రోజుల పని అమలు కాలేదని, కొత్త చట్టంలో 125 రోజులకు పెంచామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదని వారు తెలిపారు. నిజంగా పని దినాలు పెంపునకే అయితే పాత పథకాన్ని సవరించవచ్చని అయినా. ఆ పని చేయకుండా పాత పథకాన్ని రద్దు చేయడం దుర్మార్గమని వివరించారు. కేంద్ర నిధులు వాటా తగ్గించడం రాష్ట్రాలపై అదనపు భారాలు మోపడం అని ఇప్పటికే రాష్ట్రాలు అప్పులు ఊబిలో కురుకు పోయాయని మరల రాష్ట్రాల మీద బారాలు వేస్తే ఈ ఉపాధి పనిని కొనసాగించే పరిస్థితి ఉండదని కావున పాత ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కొత్త పథకాన్ని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డీ సత్యనారాయణ, దత్తు నాగేశ్వరరావు, దాసరి సత్యనారాయణ, పెనగంటి దుర్గ, బుద్దన వెంకటలక్ష్మి, వడ్డీ నాగమణి,అడకర్ల వెంకటేశ్వరమ్మ, బుద్ధ రామంత లక్ష్మి తదితరులు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# వడగాలుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**-అన్ని శాఖల జిల్లా, మండల అధికారులకు ఆదేశాలు**



మచిలీపట్నం, మే 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాలుల ప్రభావంపై అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి వడగాలుల నివారణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామాలు, పట్టణాల్లో ముఖ్యమైన కూడలిలో, ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచనలు ఇవ్వాలని తెలిపారు. తప్పనిసరి పరిస్థితులలో బయటికి వస్తే తెల్లని వస్త్రాలు తేలికపాటి నూలు వస్త్రాలు, తలకు టోపీ గాని తడి చేసినా రుమాలు ధరించాలని ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.దప్పిక ఉన్నా లేకున్నా తరచూ మంచినీరు మజ్జిగ ఓఆర్ఎస్ చెరుకు రసం నిమ్మరసం వంటివి తాగి తేమశాతం ఉండేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఉపాధి హామీ పనులు, నిర్మాణ పనులు తదితర బహిరంగ పనుల్లో పాల్గొనే కార్మికులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ సదుపాయాలు కల్పించాలని సూచించారు.ముఖ్యంగా పిల్లలు వృద్ధులు గర్భిణీ స్త్రీలు అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో తిరగకుండా జాగ్రత్త వహించాలని ప్రజలకు తెలియపరచాలన్నారు.వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని చెప్పారు.పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీటి సౌకర్యాలు పరిశీలించాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ అధికారులు పశువులకు తాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి మండలంలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.వడగాలులపై ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు.ఈ టెలి కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గాలు, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

**-మచిలీపట్నం, ఉయ్యూరు,గుడివాడ డివిజన్**

**పరిధిలోని వినియోగదారులు సద్వినియోగించుకోవాలి**

గుడివాడ, మే 20( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 21వ తేదీన ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు మచిలీపట్నం పోతేపల్లి రోడ్డు లోని జ్యూవెలరీ ఫంక్షన్ హాల్ నందు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్వర్యం లో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ పి. రవీంద్ర బాబు తెలిపారు.వినియోగదారులు విద్యుత్ సరఫరా లోపాలు, విద్యుత్ బిల్లులలో లోపాలు వంటి సమస్యలపై విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్ పర్సన్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామన్నారు.వారి తొపాటు సిజి ఆర్ ఎఫ్ సభ్యులు హాజరు అవుతారు. కృష్ణాజిల్లా పరిధిలోగల మచిలీపట్నం, ఉయ్యూరు మరియు గుడివాడ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గుడివాడ బస్టాండ్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ గేట్ సమావేశం

**రెడ్ బ్యాడ్జీలతో నిరసన**

**-విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలి..**

**-పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్**



గుడివాడ, మే 20 ( అజయ్ నారగాని - నీటి శుభోదయ) గుడివాడ బస్టాండ్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ సమావేశం నిర్వహించారు. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న విద్యుత్ బస్సులను ప్రైవేట్ సంస్థల ద్వారా కాకుండా నేరుగా ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సుల నిర్వహణ కోసం డ్రైవర్లు, సిబ్బందిగా ఆర్టీసీ ఉద్యోగులనే నియమించాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంలో టికెట్ జారీ ప్రక్రియలో మార్పులు చేసి, టికెట్ అవసరం లేకుండా ప్రయాణించే విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని, పెండింగ్ డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బలోపేతం, ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి జె మూర్తి, అధ్యక్షుడు ఏ వాసు, రీజనల్ ఉపాధ్యక్షుడు ఎల్ బసవయ్య,నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "లారీ ఢీకొని మోటార్ సైకిలిస్ట్ అక్కడికక్కడ మృతి"



తాడేపల్లిగూడెం మే 20 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ) :: తాడేపల్లిగూడెం పోలీసు సైలెంట్ సెంటర్లో ఏలూరు వైపు నుండి తణుకువైపు వెళుతున్న లారీ పోలీసు ఐలాండ్ సెంటర్లో చలివేంద్రం వద్ద మంచినీళ్లు త్రాగి వస్తున్న నిడదవోలు మండలం పెండ్యాల గ్రామానికి చెందిన మోటార్ సైకిలిస్ట్ పేరిచర్ల రాజు(వయస్సు 52) లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. బైకును ఢీ కొట్టి పక్కనే ఉన్న ఈలి ఆంజనేయులు విగ్రహం దిమ్మను ఢీకొని ఆగిపోయింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వేద పరిరక్షణ ట్రస్ట్ కు విరాళం అందజేత



విజయవాడ, మే 20 (నేటి శుభోదయ):- వేద పరిరక్షణ ట్రస్ట్ కు హైదరాబాద్ కు చెందిన వేదాంతం షణ్ముఖ రామకృష్ణ రూ.1,00,000/- విరాళాన్ని ఆలయ అధికారులను కలిసి అందజేసారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

# ప్రజలను, అధికారులను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, మే 20 (నేటి శుభోదయ):- ఎంతటి పెద్ద సమస్య అయినా ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కూర్చుని చర్చించుకోవడం ద్వారా ఆ సమస్యను పరిష్కరించుకోవచ్చునని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఈ విధంగా నియోజకవర్గంలో ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలను చూపినట్లు తెలిపారు.బుధవారం ఉదయం తూర్పులోని 12వ డివిజన్‌లోని అయ్యప్ప నగర్ ట్రెజరీ ఎంప్లాయిస్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. స్థానిక సమస్యలను అక్కడి వారిని అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పోరేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో రూ.12 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు గద్దె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్య ఎప్పటి నుంచో ఉందని, ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రైనేజీ అంటే కాలకృత్యాలు తీర్చుకోడానికే కాని, ఇంటిలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను వాటిలో వేయడానికి కాదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయడం అంటే ఒక వరంగా భావించాలని, ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో యూజీడీ లేని ప్రాంతాలు చాలా ఉన్నాయన్నారు. అందువల్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఇటీవలే ఈ ప్రాంతంలోని డ్రైనేజీని క్లీనింగ్ చేసే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, శానిటరీ నాప్‌కిన్స్, ఇంటిలో ఉత్పత్తి అయ్యే చెత్త వచ్చాయని స్థానికులు చెప్పారన్నారు. డ్రైనేజీలో వ్యర్థాలు వేయడం వల్ల స్థానికంగా ఉండే వారే చాలా ఇబ్బందులు పడతారని అన్నారు. డ్రైనేజీ మ్యాన్ హోల్స్ మూతలు ఎత్తుగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందువల్ల రోడ్డు నిర్మాణం కావాలని స్థానికులు అడుగుతున్నారని, కమీషనర్‌కు తెలియజేసిన వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని అన్నారు. సుమారు రూ.12 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఎంతటి సమస్యను అయినా అధికారులు, ప్రజలను సమన్వయం చేసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కరీమ్, ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పేరేపి ఈశ్వర్, పొట్లూరి సాయిబాబు, మేదరమెట్ల నారాయణ, బుర్ర బాలు, పి.రాజేష్, మాదాల చిన్నతల్లి, కోడే సాంబశివరావు, వీరమాచినేని రంగారావు, మాస్తాన్, పఠాన్ హయత్ ఖాన్, గద్దె రమేష్, బాజీ, లియాఖత్ ఆలీ, సూర్యనారాయణ, కార్పోరేషన్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ఆంధ్ర కేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమం



విజయవాడ, మే 20 (నేటి శుభోదయ):- 33వ డివిజన్ సత్యనారాయణపురం శివాజీ కేఫ్ సెంటర్ వద్ద బుదవారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి 'ఆంధ్ర కేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని, పౌరుషాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు కు సెంట్రల్ లో ఘన నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన మహనీయులలో ప్రకాశం పంతులు పాత్ర చిరస్మరణీయమని అన్నారు.పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో, తెలుగు ప్రజల్లో ధైర్యం నింపుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవసరాన్ని బలంగా వినిపించిన నాయకుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. మద్రాస్ ప్రెసిడెన్సీ నుండి ఆంధ్రులను వేరు చేసి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడాలని ఆయన చేసిన ఉద్యమం చరిత్రలో నిలిచిపోయిందన్నారు.అపార ధైర్యసాహసాలతో ప్రజల కోసం పోరాడిన కారణంగానే ఆయనను "ఆంధ్రకేసరి"గా ప్రజలు గౌరవించారని తెలిపారు. తెలుగు జాతి గౌరవం కోసం, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రకాశం పంతులు చూపిన మార్గంలోనే తాము కూడా పనిచేస్తామని స్పష్టం చేశారు.భావితరాలకు ప్రకాశం పంతులు సేవలు, త్యాగాలు గుర్తుండేలా ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. తెలుగు జాతి కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ మహానేతకు ఈ నియోజకవర్గ ప్రజల తరఫున ఘన నివాళులు అర్పిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ అధ్యక్షులు నాళం కోటేశ్వరరావు, కృష్ణ ప్రసాద్, చిలువేరు శ్రీను, నాగయ్య, తుమ్మలపెంట శ్రీనివాసరావు, బడేటి ధర్మారావు, అరుణ్, యువరాజ్ మహేష్ తదితరులు పాల్గొని టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# 'కంకర రవాణా చేసేటప్పుడు ప్రజలకు ఇబ్బంది కలిగితే ఉపేక్షించేది లేదు..'

**- క్వారీ, క్రషర్ మరియు లారీ యజమానులు తో సమీక్ష సమావేశం జరిపిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);కంకర, ఇసుక రవాణా చేసేటప్పుడు ప్రజలకు ఇబ్బంది కలిగితే ఉపేక్షించేది లేదని, రోడ్లు, రవాణా మార్గంపై వాహనాలపైనుండి గ్రావెల్, కంకర జారి పడటం, అధిక లోడ్లు, ఓవర్ స్పీడ్ తగ్గించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హెచ్చరించారు. ఎప్పటికప్పుడు వాహనాలకు సామర్థ్యం చెక్ చేసుకోవాలని , సరైన అనుమతులతో అనుభవం గల డ్రైవర్లుతో మాత్రమే రవాణా చేయాలని ఆయన సూచించారు. క్వారీ, క్రషర్, లారీ యజమానులతో రాజానగరంలోని తన కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం జరిపిన ఎమ్మెల్యే బలరామకృష్ణ.. వారికి బలమైన సూచనలు చేశారు.లోడ్ అయిన తర్వాత ప్రతీ వాహనంపై పూర్తిగా కవర్ (తార్పాల్) తో కప్పేటట్టు పూర్తి జాగ్రత్తలు తీసుకోవలని, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా తప్పు చేస్తే తుప్పు రేగ్గొడతానని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అనుగుణంగా క్వారీ, కాంట్రాక్టర్లు పనిచేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ కు సూచన చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని క్వారీ, క్రషర్ యజమానులు లారీ కాంట్రాక్టర్లతో శాసనసభ్యులు బలరామకృష్ణ జరిపిన సమీక్ష సమావేశంలో కంకర కాంట్రాక్టర్లకు పలు సూచనలు, సలహాలు, హెచ్చరికలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇసుక కాంట్రాక్టర్లతో పాటు ప్రభుత్వ అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# వర్షాకాలం లోపు డ్రైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి

**: విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, మే 20 (నేటి శుభోదయ):- రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో చేపడుతున్న డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బందర్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ రోడ్డు, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, రామలింగేశ్వర నగర్ తదితర ప్రాంతాలను పర్యటించి జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షపు నీరు రహదారులపై నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కృష్ణవేణి స్కూల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్రతి వర్షాకాలంలో ఎదురయ్యే నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఔట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. ఈ పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి వర్షపు నీరు ఎటువంటి ఆటంకం లేకుండా సాఫీగా ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యమని కమిషనర్ తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, పనులు వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ రామలింగేశ్వర నగర్ కట్ట రోడ్డు, బెంజ్ సర్కిల్ మీదుగా కనకదుర్గమ్మ వారధి వరకు పర్యటించి నగర సుందరీకరణ, హరితాభివృద్ధి పరిశీలించారు. నగరంలో హరితాన్ని మరింత పెంచి ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ప్రధాన రహదారులు, డివైడర్లు, ఖాళీ ప్రదేశాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే. షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సామ్రాజ్యం తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలందరూ మధ్యాహ్నం 12 నుంచి ఐదు గంటల వరకు బయటకు రావద్దు విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర




విజయవాడ, మే 20 (నేటి శుభోదయ):- పెరుగుతున్న ఎండ తీవ్రత దృశ్య రానున్న వారం రోజుల్లో ప్రజలందరూ మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు బయటకు రావద్దని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర విన్నవించారు. బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ ఛాంబర్ లో నగరపాలక సంస్థ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెరుగుతున్న ఎండ తీవ్రతకు ప్రజలకు వడదెబ్బ తగలకుండా అధికారులు తీసుకోవాల్సిన చర్యలు ప్రజలకు కల్పించాల్సిన అవగాహన కార్యక్రమాలపై సమావేశం నిర్వహించి, ప్రజల ఆరోగ్య రక్షణకు అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రజలకు వడదెబ్బ తగలకుండా నగర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు "డూస్ అండ్ డోంట్స్" కరపత్రాలు, సోషల్ మీడియా, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు, వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా బస్ స్టాండ్లు, మార్కెట్లు, ట్రాఫిక్ జంక్షన్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అన్నా క్యాంటీన్లు, అధిక రద్దీ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలు, చలివేంద్రాలు, తాత్కాలిక నీటి కియోస్కులు, షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన 104 చలివేంద్రాలను సమీక్షించి అవసరమైతే మరిన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రధాన రహదారులు, ట్రాఫిక్ కూడళ్లు, మార్కెట్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో మిస్ట్ వాహనాల ద్వారా నీటి తుంపర్లు జల్లడం, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయడం, తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు కొనసాగించాలని తెలిపారు. ప్రతి అన్నా క్యాంటీన్ క్యూ లైన్ వద్ద కచ్చితంగా నీడను ఏర్పాటు చేయాలని, నగరంలోని ఉద్యానవనాలు, ఆట స్థలాలకు ఉదయం 9 గంటల తర్వాత సాయంత్రం 5 గంటల లోపు ప్రజలు, ముఖ్యంగా వాకర్లు రాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. వృద్ధులు, నిరాశ్రయులు, వీధి వ్యాపారులు, పారిశుద్ధ్య కార్మికులు, నిర్మాణ కార్మికుల పై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. వార్డు స్థాయిలో అవసరమైన ORS ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే పనులు, పారిశుద్ధ్య కార్యకలాపాలు, డీసిల్టింగ్, నిర్మాణ పనులు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని, క్లోరినేషన్, నీటి నాణ్యత పరీక్షలను నిరంతరం నిర్వహించాలని కమిషనర్ తెలిపారు. హీట్ వేవ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, అత్యవసర పరిస్థితుల పరిష్కారానికి కంట్రోల్ రూములు నిరంతరం పనిచేయాలని ఆదేశించారు. జంతువులు, పక్షుల రక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పార్కులు, మార్కెట్లు, ప్రధాన కూడళ్లలో పక్షులకు నీటి పాత్రలు, జంతువులకు తాగునీటి తొట్లు ఏర్పాటు చేసి వాటిని క్రమం తప్పకుండా నింపేలా చూడాలని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు, సచివాలయాల్లో కూడా పక్షులకు నీటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ పరిస్థితులను పర్యవేక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. హీట్ వేవ్‌కు సంబంధించిన ఏ అత్యవసర పరిస్థితి వచ్చినా వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు ఏ రవీంద్రరావు, డాక్టర్ డి చంద్రశేఖర్, జోనల్ కమిషనర్లు కే.షమ్మీ, కే ప్రభుదాస్, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, ఏ శ్రీనివాసరెడ్డి, జి సామ్రాజ్యం, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు అన్నపూర్ణ,గోపాల్ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డి హరీష్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ పాల్గొన్నారు.

## తీవ్రమైన ఎండల నేపథ్యంలో
## ఎగ్జిబిషన్‌లలో అగ్నిమాపక భద్రతా చర్యలు తప్పనిసరి

**సాయంత్రం 5 గంటల తరువాత మాత్రమే ఎగ్జిబిషన్‌లకు అనుమతి**



విజయవాడ, మే 20 (నేటి శుభోదయ):- ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్రమైన ఎండల (హీట్ వేవ్) పరిస్థితులు, అగ్ని ప్రమాదాల అవకాశాలు పెరిగిన నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని నగర పరిధిలో నిర్వహిస్తున్న అన్ని ఎగ్జిబిషన్‌లు, జాతరలు మరియు తాత్కాలిక వాణిజ్య ప్రదర్శనల నిర్వాహకులు తప్పనిసరిగా అగ్నిమాపక భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ ఆర్.యఫ్.ఓ. రత్న బాబు సూచించారు. ఎగ్జిబిషన్ ప్రాంగణాలలో ముఖ్యంగా విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాసిరకం వైరింగ్ లేదా ఓవర్‌లోడ్ విద్యుత్ వినియోగం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యక్తిగత స్టాళ్లలో వంట చేయడం, గ్యాస్ సిలిండర్ల వినియోగం, మంటలు వెలిగించడం వంటి చర్యలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఎగ్జిబిషన్ ప్రాంగణంలో తగిన సంఖ్యలో అగ్నిమాపక పరికరాలు (ఫైర్ ఎక్స్టింగ్విషర్లు) అందుబాటులో ఉంచాలని, వాటి పనితీరును నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల సమయంలో ప్రజలు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు అవసరమైన ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలను ఎటువంటి అవరోధాలు లేకుండా నిర్వహించడంతో పాటు స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.తీవ్రమైన ఎండల కారణంగా ప్రజల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకొని ఎగ్జిబిషన్‌లను సాయంత్రం 5.00 గంటల తరువాత మాత్రమే ప్రజలకు తెరవాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న వేళల్లో ప్రజలు ఎండ తీవ్రతకు గురికాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.అదనంగా, సందర్శకుల సౌకర్యార్థం తగినంత తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రాథమిక చికిత్సా కేంద్రం లేదా వైద్య శిబిరం (మెడికల్ క్యాంప్) ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలకు తక్షణ చికిత్స అందించేందుకు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు.ప్రజల ఆరోగ్యం, భద్రత మరియు అగ్ని ప్రమాదాల నివారణను దృష్టిలో ఉంచుకొని పై సూచనలను అన్ని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆర్ యఫ్ ఓ రత్న బాబు అన్నారు. నియమాలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ఈ పర్యటనలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుక కాదు.. ఆపన్నహస్తం

**- ఎస్ఐ సత్యవతి మానవత్వం**



విజయవాడ, మే 20 (నేటి శుభోదయ):- పుట్టినరోజు వేడుకలకు ఖర్చు చేయకుండా ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకుని ఇబ్రహీంపట్నం ఎస్ఐ సత్యవతి మానవత్వం చాటుకున్నారు.ఇబ్రహీంపట్నంకు చెందిన మల్లయ్య కుమార్తె తీవ్రమైన లివర్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతోంది. చికిత్సకు సుమారు రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్యవతి తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.6,000 ఆర్థిక సహాయం అందించారు. దాతలు స్పందించి చిన్నారి వైద్యానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.ఎస్ఐ సేవా దృక్పథాన్ని స్థానికులు అభినందించారు.దాతలకు విజ్ఞప్తి: చిన్నారి వైద్యానికి రూ.25 లక్షలు అవసరం. సహాయం చేయదలచిన దాతలు పాప తండ్రి మల్లయ్య ఫోన్ నెంబర్ 8886969488 సంప్రదించగలరు.

## గాడాలలో అక్రమంగా ఏర్పాటు
## చేస్తున్న లేఅవుట్ రోడ్డు పై చర్యలు తీసుకోండి..!

**జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన మాజీ ఉపసర్పంచ్ శ్యామలరావు..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాలలో షిరిడి నగర్ లేఅవుట్ పక్కన ఏర్పాటు చేస్తున్న లేఅవుట్ సంబంధించి అక్రమ రోడ్లపై చర్యలు తీసుకోవాలని షిరిడి నగర్ అసోసియేషన్ తరపున గాడాల మాజీ ఉప సర్పంచ్ సుతాపల్లి శ్యామలరావు జిల్లా కలెక్టర్ తో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసి స్థానిక మీడియాకు సదరు పత్రాలను శ్యామల రావు అందజేశారు. చాలా కాలం క్రితం 27.65 ఎకరాలలో ఏర్పాటు చేసినటు వంటి 'షిరిడి నగర్ లేఅవుట్' పక్కన సతీష్ మరియు ఇతరులు ఇల్లిగల్ రోడ్స్ నిర్మాణం చేస్తున్నట్లుగా శ్యామల రావు ఫిర్యాదు చేశారు. రోడ్డు నుండి రోడ్డు కు మార్గం వదలమని అడిగితే తన పట్ల సతీష్ దురుసుగా మాట్లాడాడని శ్యామల రావు పేర్కొన్నారు. సతీష్ ఏర్పాటు చేస్తున్నటువంటి లే అవుట్ కు స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇతర అధికారులు ఏ విధంగా అనుమతి ఇచ్చారో తెలపాలని శ్యామల రావు డిమాండ్ చేశారు. ఈ విషయంపై పంచాయతీ రెవెన్యూ అధికారులు అందరికీ ఫిర్యాదు చేస్తున్నానని, అవసరమైతే కోర్టుకు కూడా వెళ్తానని శ్యామల రావు పేర్కొన్నారు.

## వాహన తనిఖీలు నిర్వహించిన బాపట్ల డిఎస్పి చంద్రమౌళి



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) మే 20 :బాపట్ల ఆంజనేయ స్వామి గుడి వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన బాపట్ల డిఎస్పి చంద్రమౌళి మహిళా ఎస్సై నస్రిన్. ఈ తనిఖీలలో భాగంగా, వాహనదారుల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు అవగాహన కల్పించడంతోపాటు, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రమౌళి మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని వాహనదారులు తో మాట్లాడుతూ వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించవలెను వాహనదారుడు తో పాటు వెనక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలి ముఖ్యంగా హెల్మెట్ అనేది 90 శాతం యాక్సిడెంట్ నుంచి ప్రాణాలు కాపాడే ఒక ఆయుధం.ఇటీవల కాలంలో చాలా యాక్సిడెంట్ లో మరణించిన వారు ఎక్కువ మంది హెల్మెట్ లేకపోవడం వల్లనే హెల్మెట్ అనేది భారం కాకుండా బాధ్యతగా ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపి మన చుట్టుపక్కల ఉన్న వాళ్లకి ఆదర్శంగా నిలవాలి.చిన్నపిల్లల కూడా వాహనం మీద ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలి.నాణ్యమైన హెల్మెట్లు ధరించి వాహనదారులు తమ ప్రాణాల్ని రక్షించుకో వాల్సింది గా తెలియజేశారు.ముఖ్యంగా హెల్మెట్ ధరించటం వల్ల యాక్సిడెంట్ అయినప్పుడు తలకి దెబ్బ తగలకుండా చిన్నపాటి గాయాలతో మన ప్రాణాల్ని రక్షించుకోవచ్చు. కారు నడిపేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని ఆయన కోరారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాణాలకు రక్షణ కల్పిస్తాయని గుర్తుచేశారు. ప్రతి వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలి. ముఖ్యంగా, మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ నిర్వహించే ఈ తనిఖీలు వాహనదారులను ఇబ్బంది పెట్టడం కోసం కాదని,ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించి ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ లక్ష్యమ ని బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి చంద్రమౌళి మహిళా ఎస్సై నస్రిన్ హెడ్ కానిస్టేబుల్ విక్టర్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంధన పొదుపులో బాపట్ల ఎమ్మెల్యే
## వేగేశన నరేంద్ర వర్మ రాజు గారి వినూత్న అడుగు!



బాపట్ల నేటి శుభోదయమే 20 :దేశంలో ఇంధన పొదుపును ప్రోత్సహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపునకు బాపట్ల , ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మద్దతుగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలనే అవగాహన కల్పిస్తూ... ఆయన ఈరోజు నియోజకవర్గంలో నిర్వహించిన పలు అధికారిక కార్యక్రమాలకు స్వయంగా ఎలక్ట్రిక్ స్కూటర్ పై ప్రయాణించారు. సమాజంలో మార్పు కోసం ఒక ప్రజాప్రతినిధిగా ఆయన చూపిన ఈ చొరవ, ఆదర్శవంతమైన నడక అందరినీ ఆకట్టుకుంటోంది.

## ప్రముఖ సాహితీవేత్త,
## సీనియర్ జర్నలిస్ట్ రావూరి నరసింహ వర్మ కన్ను



బాపట్ల నేటి శుభోదయమే 20 :ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు రావూరి శ్రీశైలపతి గారి కుమారుడు, సీనియర్ జర్నలిస్ట్, సుప్రసిద్ధ సాహితీవేత్త, సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ బుధవారం మధ్యాహ్నం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఆయన, బాపట్లలోని శ్రీ పొట్టి శ్రీరాములు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నరసింహ వర్మ గారు గతంలో ప్రముఖ దినపత్రికలలో విలేఖరిగా సేవలందించి, సీనియర్ జర్నలిస్టుగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సాహిత్యంపై ఉన్న మక్కువతో సాహితీ భారతి అనే సంస్థను స్థాపించి, వేయికి పైగా జిల్లా, రాష్ట్ర స్థాయి కవితల పోటీలను, సాహిత్య సభలను నిర్వహించారు. ఎందరో నవయువ కవులను ప్రోత్సహిస్తూ వారికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారు.ఆయన తండ్రి రావూరి శ్రీశైలపతి గారు దేశ స్వాతంత్రం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన గొప్ప సమరయోధులు. మహాత్మా గాంధీ గారు బాపట్ల వచ్చినప్పుడు శ్రీశైలపతి గారు తమ ఇంట ఆయనకు ఆతిథ్యమిచ్చారు. అలాగే విశ్వకవి సామ్రాట్ గుర్రం జాషువా గారికి కూడా ఆశ్రయమివ్వగా, జాషువా గారు తన అముద్రిత కావ్యం శివాజీని శ్రీశైలపతి గారికే అంకితం ఇచ్చారు.ఇలాంటి గొప్ప వంశానికి చెందిన నరసింహ వర్మ గారు స్వాతంత్ర సమరయోధుల వంశజునిగా, సీనియర్ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా సమాజానికి చేసిన సేవలను గుర్తించి, ఈ ఏడాది (2026) జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ గారు ఆయన్ను ఘనంగా సత్కరించారు.నరసింహ వర్మ గారి హఠాన్మరణం పట్ల భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, సాహితీ భారతి ప్రతినిధులు, పలువురు సాహితీవేత్తలు, జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలుగు సాహిత్య లోకానికి, జర్నలిజ రంగానికి ఆయన మరణం తీరని లోటని వారు కొనియాడారు.

## జమ్మలపాలెం ఫ్లైఓవర్ వద్ద వాహన
## తనిఖీలు నిర్వహించిన బాపట్ల డిఎస్పి చంద్రమౌళి



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) మే 20 :బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు గారి ఆదేశాల మేరకు బాపట్ల పట్టణంలోని పలు ప్రాంతాల నందు వాహన తనిఖీలు నిర్వహించిన బాపట్ల డిఎస్పి చంద్రమౌళి గారి పర్యవేక్షణలో బాపట్ల టౌన్ ఎస్సై విజయ్ కుమార్ మహిళా ఎస్సై నస్రిన్. వాహన తనిఖీల్లో భాగంగా వాహన పత్రాలు , హెల్మెట్ లేని అటువంటి వాహనదారులకు ఫైన్లు విధించారు .ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ వాహనదారులతో మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు మరియు వెనక కూర్చునేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించవలెను ఇటీవల కాలంలో చాలా యాక్సిడెంట్లు లో మరణించిన వారు హెల్మెట్ లేకపోవడం వల్లే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం పోలీసుల కోసం కాదని, ప్రతి ఒక్కరి ప్రాణ రక్షణ కోసం అని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ధరించటం వల్ల ప్రాణాపాయం నుంచి ఎలా తప్పించుకోవచ్చో వాహనదారులకు వివరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరు వాహనదారుడు ప్రతి రోజు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి ఇది భారంగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని పట్టణ ఎస్సై విజయ్ కుమార్ వాహనదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి చంద్రమౌళి పట్టణ ఎస్ఐ విజయ్ కుమార్ మహిళా ఎస్సై నస్రీన్ హెడ్ కానిస్టేబుల్ మూర్తి, కృష్ణ కిషోర్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

## "మంచి పాలనకు మద్దతుగా నిలవండి :ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం మే 20 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ)::: కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పరిపాలనకు ప్రజలు మద్దతుగా నిలవాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్అన్నారు.తాడేపల్లిగూడెం నియోజకవర్గంపెంటపాడు మండలం ముదునూరు గ్రామంలో బుధవారం రైతులకు పట్టాదార్ పాస్ బుక్కుల పంపిణీ,ప్రజల వద్దకే పాలన, మన కోసం మన ఎమ్మెల్యే 'ప్రజాదర్బార్' ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించవలసిందిగా అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అవినీతి, అరాచక పాలన పాలనతో ప్రజాధనాన్ని దోపిడీ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో కూటమి ప్రభుత్వంలో అవినీతి లేని బాధ్యతాయుతమైన పరిపాలన అందిస్తున్నామని అన్నారు. రైతుల భూములకు పాస్ బుక్ లపై జగన్ ఫోటోలు వేసుకొని, ఇబ్బందులకు గురిచేసారనిఅన్నారు.కూటమి పాలనలో రాజ ముద్ర తో పాస్ బుక్కులు అందిస్తున్నామని అన్నారు. రైతుల ధాన్యానికి 24 గంటల్లో సొమ్ములు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి ఎటువంటి అవినీతి లేకుండా అందిస్తున్నామని అన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా సహించబోమని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే వెంటనే తన కార్యాలయానికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సునీల్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ జీవీకే మల్లికార్జునరావు, ఎంపీడీవో రాంప్రసాద్,బిజెపి ఇంచార్జ్ ఈతకోటి తాతాజీ, పుల్లా బాబి, ఎంపీపీ కట్టుపోయిన వెంకటలక్ష్మి, ఆకాశపు స్వామి,పాలూరి వెంకటేశ్వరరావు, చాపల రమేష్, మద్దాల మణికుమార్, కిలపర్తి వెంకటరావు, దత్తు ప్రసాద్, బండారు శ్రీను, దాసరి అప్పన్న, బేతిన గిరిధర్, పసుమర్తి రామ్ లక్ష్మణ్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, కొనగళ్ళ హరినాథ్, వాడపల్లి సుబ్బరాజు, చెరుకూరి సోమశేఖర్, బుద్ధన నారాయణ, పసల కొండ, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు,

## ఆర్గానిక్ మామిడిపండ్లకు భలే గిరాకే గిరాకీ



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఆర్గానిక్ పద్ధతిలో పండించిన మామిడి పండ్లకు రోజురోజుకు గిరాకే గిరాకీ పెరుగుతోంది. వినియోగదారులు ఈ ఆర్గానిక్ పండ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు . సంపూర్ణ ఆర్గానిక్ పద్ధతిలో దొరికే మామిడి పండ్ల కోసం వినియోగదారులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్న తరుణంలో శ్రీ శివశక్తి ఆర్గానిక్ మామిడి తోటలో పండించిన మామిడి పండ్ల కోసం వినియోగదారులు విపరీతంగా ఆసక్తి చూపుతున్నారు. రామన్నపేట లోని శ్రీ శివశక్తి ఆర్గానిక్ మామిడి తోటలో ప్రారంభం నుంచే ఆర్గానిక్ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. శ్రీ శివశక్తి ఆర్గానిక్ మామిడి తోటలో ఆర్గానిక్ మామిడిపండ్లు పండించడానికి తొలి దశలో తోటలోని చెట్టు మొదలులో ఎటువంటి రసాయనాలు వేయరు. కేవలం ఆవు పేడ, జీవామృతం , వేప పిండి వేస్తారు. అలానే పువ్వు దశలో పుల్లటి పెరుగు, ఇంగువ కలిపి స్ప్రే చేస్తారు. పురుగు దశలో వేప నూనె, సోప్ వాటర్ స్ప్రే చేయిస్తారు. పండించేటప్పుడు గడ్డి , ప్రభుత్వ అనుమతి కలిగిన వాటి ద్వారా పండిస్తారు. ఇలా ఎక్కడా రసాయనాల వాడకం లేకుండా చక్కని ఆర్గానిక్ మామిడి పండ్లు లభిస్తున్నాయి. చెట్టు మీద కాయ పండదు. చెట్టు ఆరోగ్య ప్రయోజనాల కోసం పండించకూడదని మామిడి తోట యజమానులు విశ్వసించి వినియోగదారుల ఆరోగ్యానికి కొండంత భరోసా ఇస్తున్నారు. ఖానాపురం హవేలీ లోని శ్రీ జయ శ్లోక పాఠశాల యాజమాన్యం శర్మ షిఫాలి, జగదీష్ శర్మ ఈ అరుదైన కార్యక్రమానికి శ్రీకారం






చుట్టి తమ రామన్నపేట ఐదు ఎకరాల శ్రీ శివశక్తి ఆర్గానిక్ మామిడి తోటలో ఆర్గానిక్ మామిడి పండ్లను గత ఐదు సంవత్సరాలుగా ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తూ వినియోగదారుల మన్నలను పొందుతున్నారు. తమ తోటలోని ఆర్గానిక్ మామిడి పండ్లను మామిళ్ళగూడెం లోని గీతాంజలి డిగ్రీ కళాశాల పక్కన ఉన్న శ్రీ బాలా గణేష్ నిలయంలో ప్రతిరోజు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. వినియోగదారులకు సంపూర్ణ ఆరోగ్యకరమైన మామిడి పండ్లను అందించాలనే సామాజిక బాధ్యతతో శ్రీ జయ శ్లోక పాఠశాల యాజమాన్యం ఈ బృహత్ కార్యక్రమాన్ని గత ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తూ ప్రజల నుంచి ప్రశంసలందుకుంటున్నారు. ఈ సందర్భంగా షిఫాలీ జగదీష్ శర్మ మాట్లాడుతూ రామన్నపేట లోని శ్రీ శివశక్తి ఆర్గానిక్ మ్యాంగో గార్డెన్ నందు ప్రకృతి వ్యవసాయ విధానంలో, సేంద్రియ పద్ధతిలో మామిడి సాగు చేస్తున్నామని తెలిపారు. సేంద్రియ ఫలాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరుతున్నారు. ఆర్గానిక్ మామిడి పండ్లు కావలసినవారు

## క్రైస్తవులపై కూటమి ప్రభుత్వం
## వైఖరికి నిరసనగా వైసీపీ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన



విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్)విస్సన్నపేట మండల కేంద్రంలోని వైఎస్ఆర్ పార్టీ కార్యాలయం నుండి భారీ సంఖ్యలో వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలతో తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు నిరసనతో కూడిన శాంతి యుత కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ జడ్పీటీసీ చైర్పర్సన్ నల్లగట్ల సుధారాణి,వైసీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర నాయకులు నరేడ్ల వీరారెడ్డి,జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి,జిల్లా నాయకులు లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ శిరసాని ప్రకాష్,మండల వైసీపీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు,ఎంపీపీ గద్దల మల్లయ్య,జిల్లా నాయకులు చింతల ప్రసాద్ రెడ్డి, కొర్లమండ వైసిపి నాయకులు లక్ష్మణరావు,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తానంకి రాంబాబు,మాజీ ఎంపీపీ భూక్య రాణి,జిల్లా నాయకులు ముంగా జయరాజు,రామవరపు శ్రీను, తిరుపతిరావు,కాలేషా, కల్నాయక్,షరీఫ్,నాని, వెంగళ బ్రదర్స్ దస్తగిరి,ఆలీ, భాష,శీలం శ్రీను, సాదుపాటి కోటేశ్వరరావు,రాష్ట్ర మీడియా కన్వీనర్ కోపల్లి జయకర్,విక్రం సతీష్,బి మహేశ్వరావు,సాంబయ్య, పిల్లి రాజేష్,వల్లభ దాసు నరసింహారావు,గొర్రె లాజర్, చశీద్రుపట్ల మాజీ సర్పంచ్ భూబత్తుల బాలకొండయ్య, మాజీ సర్పంచ్ పి లక్ష్మయ్య విస్సన్నపేట మాజీ వార్డ్ మెంబర్ సానం ధనలక్ష్మి, సుదర్శనం,చిరంజీవి సూర్య నాయక్,కాంతయ్య,ఏలాలయ్య,రెడ్డి నటరాజ్,జి సీతారామయ్య,కరీముల్లా,బి మాధవరావు,సునీల్ చెన్నారావు,నరసాపురం వైసిపి నాయకులు చెన్నారావు,చెన్నారెడ్డి, కలగర వైసిపి నాయకులు కే తిరుపతిరావు, రామచంద్రపురం వైసీపీ యూత్ నాయకులు షణ్ముఖ రెడ్డి,కాపు నాయకులు హరి, గిరిజన నాయకుడు ధారావత్ శీను,అడ్డగట్ల శ్రీను,పుట్రాల వైసిపి నాయకులు గజ్జల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీది మైండ్ గేమ్ రాజకీయాలు

**: కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ**



ఖమ్మం, నేటి శుభోదయ ::: స్థానిక 44వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం కేవలం దుష్ప్రచారమేనని 44వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా పాలెపు విజయ వెంకటరమణ మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ పార్టీలోనే ఉండి, ప్రస్తుతం తిరిగి అదే పార్టీ కండువా కప్పుకున్న వారిని చూపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ మారారంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. 44వ డివిజన్ నుండి ఏ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా పార్టీ మారలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం తమ ఉనికిని చాటుకోవడానికే బిఆర్ఎస్ పార్టీ ఇలాంటి చౌకబారు మైండ్ గేమ్‌లు ఆడుతోందని విమర్శించారు.

### -మంత్రి తుమ్మల నేతృత్వంలోనే అభివృద్ధి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అపార అనుభవంతో, ఆయన నేతృత్వంలో ఖమ్మం నగరం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని విజయ వెంకటరమణ పేర్కొన్నారు."నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరడానికి ప్రజలు, కార్యకర్తలు ఆసక్తి చూపిస్తున్నారు. అంతే తప్ప, మునిగిపోయే నావ లాంటి బిఆర్ఎస్ పార్టీలోకి ఎవరూ వెళ్ళరని,ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న అవాస్తవ ప్రచారాలను, మైండ్ గేమ్‌లను మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఇకనైనా తప్పుడు ప్రచారాలు ఆపకపోతే బిఆర్ఎస్ పార్టీ కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని వారు హెచ్చరించారు.

## కేజ్రీవాల్, సిసోడియాలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ : కోర్టు ధిక్కరణ కేసులో ఆప్ నేతలు కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలని జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవీందర్ దుడేజాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 4కి వాయిదా వేసింది. తనను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అభ్యంతరకమైన ప్రచారం చేశారనే ఆరోపణలపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాను –రాజకీయ విధేయత' చూపానని, అనుబంధం ఉన్నాయని ఆరోపించారని, వారణాసి లోని ఒక విద్యా సంస్థలో తాను చేసిన ప్రసంగానికి సంబంధించి తప్పుదోవ పట్టించేలా ఎడిట్ చేసిన వీడియోను పోస్ట్ చేసి తనను లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ మే 14న కేజ్రీవాల్, సిసోడియా సహా ఇతర ఆప్ నేతలపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ చర్యలను చేపట్టారు. కేజ్రీవాల్ చట్టపరంగా తనను ఎదుర్కోకుండా సోషల్ మీడియాలో పద్ధతి ప్రకారం దూషించే విధంగా పోస్టులు చేశారని పేర్కొన్నారు. నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్ ను ప్రస్తుతం మరో ధర్మాసనం విచారిస్తుందని ఆమె స్పష్టం చేశారు. లిక్కర్ పాలసీ కేసు న్యాయ సమీక్షలో నిలబడలేదని, విశ్వసనీయత కోల్పోయిందని తీర్పునిస్తూ.. ఫిబ్రవరి 27న విచారణ న్యాయస్థానం కేజ్రీవాల్, సిసోడియా సహా మరో 21 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అయితే ఈ తీర్పును సవాలు చేస్తూ సిబిఐ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ లో తమ పేర్లను తొలగించాలని కోరుతూ ఆప్ నేతలు దాఖలు చేసిన పిటిషన్ ను ఏప్రిల్ 20న జస్టిస్ శర్మ కొట్టి వేశారు. తాము వ్యక్తిగతంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని జడ్జి ఎదుట హాజరుకామని, –మహాత్మా గాంధీ అనుసరించిన సత్యాగ్రహ మార్గం' లో పోరాడతామని పేర్కొంటూ వారు జస్టిస్ శర్మకు లేఖ రాశారు.


## అమెరికాలో అదానీపై అన్ని కేసులు కొట్టివేత

### అసాధారణ చర్య : న్యాయ నిపుణులు




న్యూయార్క్: అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న కేసులను అమెరికా న్యాయ శాఖ పూర్తిగా కొట్టివేసింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సహా పలు ఏజెన్సీలు ఈ కేసులను కొట్టివేశాయి. భారతదేశంలో ఒక సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును గెలుచుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు దశల్లో అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి డబ్బు వసూలు చేశారని అదానీపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఇటువంటి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎస్ఈసీ దాఖలు చేసిన కేసును పరిష్కరించుకోవడానికి అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు పత్రాలు చూపిస్తున్నాయి. సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. తప్పు చేశామని ఒప్పుకోకుండా, ఖండించకుండా ఈ చర్య తీసుకున్నారు. ఎల్పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ యొక్క ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసి) దాఖలు చేసిన కేసు కూడా పరిష్కరించబడింది. ఈ ఒప్పందం 275 మిలియన్ డాలర్లకు కుదిరింది. అదానీ గ్రీన్ ఎనర్జీ మరియు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీ, తమ సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో అదానీ జరిపిన సమావేశంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి, ఎస్ఈసీ పంపిన సమన్లను జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది.

## ఇరాన్‌పై దాడి వాయిదా : ట్రంప్ ప్రకటన



వాషింగ్టన్: గల్ఫ్ మిత్రదేశాల అభ్యర్థన మేరకు ఇరాన్‌పై ప్రతిపాదిత దాడిని వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రస్తుతం సమస్య పరిష్కారానికి కీలక చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ నాయకత్వం విజ్ఞప్తి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఇరాన్‌పై కఠిన సైనిక చర్యకు వెనుకాడబోమని ఇటీవల పలుమార్లు హెచ్చరించిన ట్రంప్, ఇప్పుడు దాడిని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్–అమెరికా సంయుక్త దాడుల తర్వాత గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ భారీ ప్రతిదాడులకు దిగింది. దీంతో పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినప్పటికీ శాంతి ఒప్పందం మాత్రం కుదరలేదు. దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్న వేళ యుద్ధ భయాలు మళ్లీ పెరుగుతుండగా ట్రంప్ తాజా ప్రకటన కొంత ఉపశమనాన్ని కలిగించింది. ఇటీవల చైనా పర్యటనలో భాగంగా ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరాన్ పరిస్థితులపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

## మండుతున్న ఢిల్లీ : ఐఎండి ఎల్లో అలర్ట్ జారీ



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలుగా నమోదయ్యాయి. రాబోయే మూడు రోజులు కూడా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మండే ఎండల్లో ఎక్కువసేపు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐఎండి ప్రజలకు సూచించింది. కాగా, పశ్చిమ వాయువ్య దిశల నుంచి తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉంది. వచ్చే వారంలో ప్రజలు ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది అని వాతావరణ శాఖ ఉపాధ్యక్షుడు మహేష్ పలవంత్ మీడియాకు వెల్లడించారు.

# రజినీ కుట్టీస్టోరీ.. అది విజయ్ హుందాతనం




"నేనేం రాజకీయాల్లో లేను. నాకంటే వయసులో చిన్నోడు సీఎం అయ్యాడని నేనెందుకు కుళ్లుకుంటా?" అంటూ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్పందించడం ఇప్పుడు తమిళనాట మాత్రమే కాదు దక్షిణాదిలోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. ఓడిపోయిన మాజీ సీఎం ?స్టాలిన్ ఇంటికి వెళ్లి పరామర్శించడం.. గొప్ప విజయంతో సీఎం అయిన విజయ్‌ను, అదీ పెద్ద స్టార్‌గా ఉండి కూడా మర్యాదకైనా పలకరించకపోవడంపై రజనీ అభిమానుల నుంచే పెదవి విరుపులు కనిపించాయి. ఈ క్రమంలోనే తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన ప్రెస్‌మీట్ పెట్టాల్సి వచ్చిందనేది భోగట్టా. అయితే.. రజనీకాంత్ మాట్లాడిన కొన్నిగంటల తర్వాత సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ అయ్యింది. అందులో విజయ్ ఫ్యాన్ అయిన తన కొడుక్కి రజనీ ఫ్యాన్ అయిన ఓ తండ్రి హితబోధ చేస్తాడట. అది 'బాషా' రేంజ్ ఎలివేషన్ కావడంతో ఆ కొడుకు కన్నీరు పెట్టాడంట. విజయ్ అభిమాని చేసిన పోస్ట్ అంటూ అది హల్ చల్‌కావడంతో.. "రజనీ ది గ్రేట్" అంటూ కామెంట్లు వినిపించాయి. అయితే అదంతా అభిమానులను శాంతింపజేయడం.. తన ఇమేజ్‌ను కాపాడుకోవడం కోసం రజనీ తరఫున జరిగిన పీఆర్ స్టంట్ అంటూ ఓ బాంబ్ పేలడం ఈ ఎపిసోడ్‌ను మరో మలుపు తిప్పింది. సినీ ప్రపంచంలో అభిమానుల మధ్య పోటీలు ఎప్పుడూ ఉంటాయి. కానీ, రజనీ--విజయ్ విషయంలో "ఫ్యాన్ వార్ చరిత్ర" కాస్త ప్రత్యేకమనే చెప్పాలి. తొలినాళ్లలో ఇద్దరూ వ్యక్తిగతంగా స్నేహపూర్వకంగా కనిపించినా.. అభిమానుల మధ్యే విభేదాలో లేదంటో స్టార్ డమ్ విషయంలో ఇగో అనేదో ఏమో తెలియదుగానీ పోను పోను ఆ ఇద్దరి ఆటిట్యూడ్‌ను అవి పూర్తిగా మార్చేశాయి. సినిమాలపరంగానే కాదు.. రాజకీయాలతోనూ ఆ గ్యాప్ మరింతగా ముదిరింది. 1990ల చివరలో రజనీ అప్పటికే "సూపర్‌స్టార్" స్థాయిలో ఉన్నాడు. ఆ టైంలోనే విజయ్ యువ హీరోగా ఎదుగుతున్నాడు. ఆరోజుల్లో రజనీ సినిమా విడుదలైతే తమిళనాట పండుగ వాతావరణం నెలకొనేది. అయితే దానికి పోటీగా విజయ్ అభిమానులు 'మాస్ వాతావరణాన్ని సృష్టిస్తూ' సరికొత్త ఒరవడిని సృష్టించారు. ఇది రజనీ అభిమానులకు ఏమాత్రం సహించేది కాదు. అలా ఈ పోటీ నెమ్మదిగా బాక్సాఫీస్ కలెక్షన్ల దాకా వెళ్లింది. ఇద్దరి సినిమాలు ఒకేసారి, కాస్త గ్యాప్‌లో లేదంటే ఒకే ఏడాదిలో విడుదలైనా సరే.. హిట్లు–ఫట్లు, కలెక్షన్ల లెక్కలు చూపిస్తూ కొట్టుకోసాగారు. ఈ క్రమంలో ఫేక్ కలెక్షన్ల ఆరోపణలతో పరస్పరం తిట్టిపోసుకోవడం.. ఫ్లెక్సీలు, బ్యానర్లు చించేసుకోవడం.. క్రమంగా సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ వార్స్ దాకా చేరుకుందది. ఆ సమయంలో ఇద్దరూ వాళ్ల వాళ్ల ఫ్యాన్స్‌ను వారించడం.. మళ్లీ రిపీట్ కావడం అవుతూ ఉండేది. ఈలోపు.. విజయ్ సినీ కెరీర్ ఎవరూ అందుకోలేనంత పీక్స్‌కు చేరుకుంది. కొంతకాలం సైలెంట్‌గా ఉన్న ఇద్దరి ఫ్యాన్స్.. జైలర్ సినిమా టైంలో రజనీ వ్యాఖ్యలతో మళ్లీ మొదలుపెట్టారు. "కాకి ఎప్పుడూ గద్దను ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. అలాగని గద్ద తన స్థాయిని తగ్గించుకోలేదు. అంతకంతకు పైకి ఎగిరిపోతుంది. మన స్థాయిని తగ్గించకుండా.. మన దారిలో ముందుకు పోవాలి" అంటూ రజనీకాంత్ చెప్పిన కుట్టీ స్టోరీ విజయ్ అభిమానులకు మంట తెప్పించింది. విజయ్‌ను కాకితో పోల్చాడంటూ అవమానంగా ఫీలై తలైవా మీద సోషల్ మీడియాలో దండయాత్ర చేశారు. ఇది ఎంతదాకా చేరిందంటే.. తన వ్యాఖ్యలను విజయ్ అభిమానులు పొరపాటుగా అర్థం చేసుకున్నారని స్వయంగా రజనీనే వివరణ ఇచ్చుకునేదాకా. దీనికి కౌంటర్‌గానే విజయ్ 'లియో' క్లైమాక్స్‌లో గద్ద రిఫరెన్స్ చూపించారనే ప్రచారం ఒకటి ఉంది.

### పొలిటికల్ టర్న్..!

90వ దశకంలో భయంకరమైన ఫ్యాన్‌డమ్‌ను చవిచూసిన రజనీ.. ఆ టైంలోనే రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తారని అంతా భావించారు. అయితే ఆధ్యాత్మిక ధోరణి, ఆరోగ్య సమస్యలు, మరేయితర కారణాలతో తెలియదుగానీ ఆయన ఆ పని చేయలేదు. బదులుగా జయలలితను ఢీ కొడుతూ డీఎంకే పార్టీ(కరుణానిధి.. ఎంకే స్టాలిన్) కుటుంబానికి మద్దతు ఇస్తూ వచ్చారు. అదలా కొన్నేళ్లపాటు సాగింది. చివరకు సొంతంగా రాజకీయ పార్టీ ప్రయత్నాలు ప్రారంభించిన ఆయన.. ఉన్నట్లుండి వెనక్కి తగ్గడం ఆయన అభిమానుల్ని సైతం బాధించింది. అదే సమయంలో.. విజయ్ టీవీకే పార్టీ ప్రకటన, రాజకీయ దూకుడు.. తాజా తమిళనాడు విక్టరీ.. రజనీ ఫ్యాన్స్‌ను మరింత కుంగదీసింది. అది తారాస్థాయికి చేరుకుని రజనీనే తిట్టిపోసేదాకా చేరుకుంది. నిజానికి రజనీకాంత్ స్టైల్, మేనరిజంను అనుకరిస్తూనే విజయ్ సినిమాలపరంగా హయ్యెస్ట్ రెమ్యునరేషన్ అందుకునే స్థాయికి ఎదిగాడని కోలీవుడ్‌లో ఒక టాక్. అంతెందుకు విజయ్ అభిమానులు కూడా ఆ విషయాన్ని నిర్మోహమాటంగానే ఒప్పుకుంటారు. కానీ, రజనీ అభిమానుల్లో ఇలాంటి మెచ్యూరిటీ ఏమాత్రం కనిపించదు. విజయ్‌ను ఎంతసేపు తిట్టడం, వీలైనప్పుడల్లా ట్రోలింగ్ చేయడంతోనే గడిపేస్తుంటారు. ఇంత జరుగుతున్నా రజనీ ఏనాడూ తన అభిమానుల్ని వద్దని వారించిన పని చేయలేదు. ఇటు విజయ్ కూడా ఏనాడూ రజనీ ఫ్యాన్స్ చేస్తున్న దాడిపై నేరుగా స్పందించలేదు. బదులుగా తన అభిమానులకు "పాజిటివ్‌గా ఉండండి, కష్టపడి పనిచేయండి".. " నీ విజయంతో ఎదుటివారిని ఓడించు.. నీ నవ్వుతో వారిని మట్టికరిపించు" ఇలాంటి మోటివేషన్ స్పీచ్‌లతో సందేశాలిస్తూ వచ్చాడు. విజయ్ రాజకీయ పార్టీ పెట్టాక కూడా ఆ హుందాతనం అలాగే కొనసాగడం అది అటు తన అభిమానులనే కాదు.. రజనీ, అజిత్.. ఇలా ఇతర హీరోల ఫ్యాన్స్‌ను కూడా ఆకట్టుకోగలిగింది. ఒకరకంగా ఇదే ఆయనపై గౌరవం మరింత పెంచి.. ఆయన నాయకత్వానికి బలం చేకూరింది. అయితే "ఆ స్టార్‌డమ్ నుంచి బయటకు వచ్చి సీఎంగా నిర్ణయాలు తీసుకోవాలి" అంటూ విజయ్‌కు రజనీ ఇచ్చిన సలహా.. అక్కసు వెల్లగక్కడంకాక మరేంటనే? కోణంలో ఇప్పుడు చర్చ నడుస్తోంది. తన సమకాలీకుడు(కమల్ హాసన్) స్వయంగా వెళ్లి విజయ్‌ను అభినందించడం.. విజయ్ విజయంపై మొక్కుబడిగా ఎక్స్‌లో ఓ మెసేజ్ పెట్టడం.. ఆపై తాజా ప్రెస్‌మీట్ వ్యాఖ్యల ఆంతర్యం.. విజయ్ విషయంలో రజనీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని కొందరు అంటున్నారు.

# ఇరాన్ వార్.. నయా ట్రెండ్



ప్రపంచ యుద్ధాల రూపురేఖలు మారిపోతున్నాయ్. క్షిపణులు, అణు బాంబులు, డ్రోన్లు మాత్రమే కాదు.. ఇప్పుడు సరిహద్దులు, వనరులు, ఆఖరికి డిజిటల్ నెట్‌వర్క్‌లు కూడా ఆయుధాలయ్యాయి. అదెలా సాధ్యమో.. పశ్చిమాసియా యుద్ధంతో ఇరాన్ కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. తనకంటే బలమైన సైన్యం ఉన్న అమెరికాను విసిగెత్తిస్తూ 'వార్ ట్రెండ్'ను సెట్ చేసింది. ఇరాన్ తన సరికొత్త వ్యూహం అమలుకు.. హర్మూజ్ జలసంధిని వేదికగా చేసుకుంది. దీని ద్వారానే ప్రపంచంలో ఐదో వంతు చమురు రవాణా జరుగుతుందని తెలిసిందే కదా. అందుకే జలసంధిపై తమదే పూర్తి ఆధిపత్యం అని ప్రకటించుకుని.. టోల్‌ప్లాజా ఏర్పాటుతో వసూళ్లు చేపట్టాలని భావించింది. తద్వారా.. వచ్చిన సొమ్ముతో యుద్ధం వల్ల దెబ్బతిన్న ఇరాన్‌ను పునరుద్ధరించుకోవడం, దేశ అభివృద్ధికి కావాల్సిన నిధుల్ని సమకూర్చుకుంటామని ప్రకటించి ప్రపంచ దృష్టిని ఆకర్షించుకోగలిగింది. అదే సమయంలో.. సముద్ర గర్భం కేబుళ్లపై దృష్టిసారించి భయపెట్టింది కూడా. ఇప్పుడు కేబుళ్ల విషయంలో అమెరికన్ దిగ్గజ కంపెనీలు కాంప్రమైజ్ కావాలని.. ఎంతో కొంత తమకు చెల్లించాలని(పన్ను, ఫీజు, ఫైన్.. ఏదో ఒక రూపేణా).. అలాగే వాటి నిర్వహణ(రిపేర్లు వగైరా) బాధ్యతలు కూడా తమ ఆధ్వర్యంలోనే సాగాలని కండిషన్లు పెడుతోంది. లేకుంటే కత్తిరింపులు తప్పవన్నట్లు బెదిరిస్తోంది. అలా.. తన భౌగోళిక స్థానాన్నే ఇరాన్ ఆయుధంగా మలుచుకుంది.

### టిట్ ఫర్ టాట్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ విషయంలో ఏం చేయాలనుకున్నాడో.. ఇరాన్ ఆ పనే కౌంటర్‌గా చేసి చూపించింది. అదే ఆర్థికంగా దెబ్బ తీయడం. ఇరాన్‌ను ఆంక్షలతో ఉక్కిరి బిక్కిరి చేసిన ట్రంప్.. హర్మూజ్ బ్లాకేడ్, నిధుల ఫ్రీజ్‌లను చూపించి ఇరాన్ మెడలు వంచాలనుకున్నాడు. అయితే ఆ నష్టం ధాటికి ఇరాన్ తలొగ్గలేదు. సరికదా.. యుద్ధాన్ని సరికొత్త మలుపులు తిప్పింది. యుద్ధం ప్రారంభంలో.. చౌకగా తయారైన షాహెడ్ డ్రోన్లు ఉపయోగించి అమెరికా రక్షణ వ్యవస్థలను ఆగమాగం చేసింది. తద్వారా అమెరికా సైన్యానికి భారీ నష్టం వాటిల్లింది. ఆ తర్వాత హర్మూజ్ జలసంధి ద్వారా నౌకాయానాన్ని అడ్డుకోవడంతో తన వ్యూహాన్ని మొదలుపెట్టింది. హర్మూజ్ అనేది కేవలం 21 కిలోమీటర్ల వెడల్పు ఉండడం, పైగా తమ తీరానికి దగ్గరగా ఇరాన్‌కు ఎంతో కలిసొచ్చింది. రోజుకు 100--150 నౌకలు వెళ్లే హర్మూజ్‌లో మైన్స్, డ్రోన్లు, ఫాస్ట్ అటాక్ బోట్స్‌తో నియంత్రించింది. ఫలితంగా ఒక్క నౌక కూడా నీట మునగకుండానే ఇన్సూరెన్స్ ప్రీమియంలు 300% పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటింది. యూరప్ దేశాలు అదనంగా 28 బిలియన్ డాలర్ల ఇంధన బిల్లు చెల్లించాల్సి వచ్చింది. అలా క్షిపణుల యుద్ధం కాస్తా ఆర్థిక యుద్ధం అయ్యింది.


### భవిష్యత్తులో..

ఇరాన్ తన యుద్ధాన్ని క్షిపణుల నుంచి మరో దారికి మలిచింది. ఎనర్జీ ం డేటా.. ఇవి రెండూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేసే అంశాలే. అలా రెండు కీలక ప్రవాహాలను ఒకేసారి నియంత్రించే శక్తి తమ వద్ద ఉందని ప్రపంచానికి చాటి చెప్పింది. ఇకపై యుద్ధం కేవలం బాంబులు, గన్స్‌తో కాదు.. వివిధ వనరుల రూపంలోనూ జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఇరాన్ చూపించిన ఈ యుద్ధ వ్యూహాన్ని ఉత్తర కొరియా, చైనా అధ్యయనం చేస్తున్నాయి. రష్యా కూడా ఈ ఉద్రిక్తతను నిశితంగా పరిశీలిస్తోంది. అందుకే ఇది కేవలం ఒక దేశానికి కాదు, ప్రపంచానికి కొత్త హెచ్చరిక అని నిపుణులు చెబుతున్నారు.

### కొత్తదేం కాదా?

ఇరాన్ అనుసరించిన ఈ వ్యూహం కొత్తేదేం కాదట. ఇది అర్థం చేసుకోవాలంటే చరిత్రలోని కొన్ని ఘట్టాలను గుర్తు చేసుకోవాలనుకుంటున్నారు విశ్లేషకులు. థెర్మోపిలే యుద్ధం (480 దీజ): స్పార్టా రాజు లియోనిడాస్ కొద్దిమంది సైనికులతో పర్షియన్ సైన్యాన్ని ఒక పర్వత మార్గంలో నిలువరించగలిగాడు. సంఖ్యలో తక్కువైనా, భౌగోళిక స్థానం (చోక్‌పాయింట్)ను ఉపయోగించి శత్రువుల అధిక బలాన్ని నిర్వీర్యం చేశాడు. ఇది "స్థానం" అనే ఆయుధం ఎంత శక్తివంతమో చూపించింది. రోమన్ సామ్రాజ్యం – – కార్తేజ్: ప్యూనిక్ యుద్ధాల అనంతరం రోమన్లు కార్తేజ్ పొలాలను ఉప్పు చల్లి ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారు. ఇది భౌగోళిక వనరులను ధ్వంసం చేసి శత్రువును బలహీనపరిచే వ్యూహం. నెపోలియన్ (19వ శతాబ్దం): బ్రిటన్‌తో వాణిజ్యాన్ని నిషేధించి యూరప్ ఆర్థిక వ్యవస్థను నియంత్రించాడు. ఇది వాణిజ్యాన్ని ఆయుధంగా మార్చిన ఉదాహరణ. బలహీన దేశం కూడా తన భౌగోళిక స్థానాన్ని ఆయుధంగా మార్చుకుని శక్తివంతమైన దేశాలను నిలువరించగలదు. ఇది చరిత్ర చెప్పిన పాఠం. ఆ పాఠాన్నే ఇరాన్ వల్లేసింది. అమెరికా అణు బాంబులను ఆపడానికి యుద్ధం మొదలుపెడితే.. కానీ ఇరాన్ తన భూభాగాన్ని ఆయుధంగా మార్చి మరింత శక్తివంతమైన వ్యూహాన్ని అమలు చేస్తోంది.


# ప్రమాద ఘంటికలు




దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కొంత కాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును కళ్లకు కడతాయి. రోజుల తరబడి స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై ఆందోళనకర దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. మంగళవారం నాడు స్టాక్‌మార్కెట్ సెన్సెక్స్ ఒక్కరోజులోనే 1,456 పాయింట్లు కుప్పకూలి, 11 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడుదారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం ఈ పరిణామాల కొనసాగింపే. ఇది ముదుపరులలో నెలకొన్న విశ్వాస సంక్షోభాన్ని బట్టబయలు చేసింది. అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాలపై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి.ఈ ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేస్తుండటం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్థనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్థనీయం కాదు. ప్రత్యక్షంగా పెంచకపోయినప్పటికీ, రకరకాల విన్యాసాలతో ప్రజల మూలుగులను ఇప్పటికే పీల్చి పిప్పిచేసిన సంగతిని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కొనుగోలును ఏడాదిపాటు నిలిపివేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపే చర్యే!

2026 సంవత్సరానికి భారత జిడిపి వృద్ధి అంచనాను మూడీస్ 6.5 శాతం నుండి 6.3 శాతానికి తగ్గించడం యాదృచ్ఛికం కాదు. దేశీయ వినియోగం మందగించడం, తయారీ రంగం ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, రైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అయినా, సంపన్నులకు రాయితీలు ఇచ్చి, సామాన్యులపై భారాలు మోపే విధానాలు కొనసాగిస్తూ నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్–మతతత్వ రాజకీయాలను కొనసాగిస్తోంది. ఇప్పటికైనా, ప్రభుత్వం ప్రజాకేంద్రిత ఆర్థిక విధానాలకు మరలాలి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. లేని పక్షంలో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడం ఖాయం.

# నడకకు కొత్తజీవం.. తేలికగా తుంటి మార్పిడి



తుంటి నొప్పితో నడవలేని స్థితిలో ఉన్న రోగులకు మందులు పనిచేయని పరిస్థితిలో చివరి అవకాశం హిప్ రీప్లేస్‌మెంటే! అయితే ఒకప్పుడు హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స అంటే చాలామంది భయపడేవారు. కారణం పెద్ద కోత, తీవ్రమైన నొప్పి, అధిక రక్తస్రావం, వారాల తరబడి దవాఖానలో గడపడం, నెలల తరబడి విశ్రాంతి. ఇవన్నీ రోగిని కంగారుపెట్టేవి. అంతేకాదు కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్లు కూడా తలెత్తేవి.కానీ, గత 10-15 సంవత్సరాల్లో టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ (టీహెచ్‌ఆర్) పద్ధతి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. దీనివల్ల రోగి వేగవంతంగా కోలుకునే వెసులుబాటు ఏర్పడింది. అంతేకాకుండా, చిన్నకోత, తకువ నొప్పి, సుమారు 25-30 సంవత్సరాలపాటు మన్నికగా ఉండే ఇంప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధానంతో మోకాళ్లు, నడుము నొప్పులతో బాధపడుతూ జీవన నాణ్యత కోల్పోయినవేలాది మంది రోగులు మరోసారి చురుకైన జీవితాన్ని అందుకోగలుగుతున్నారు. అయితే హిప్ రీప్లేస్‌మెంట్‌లోవచ్చిన ఆధునిక పద్ధతులు, వాటి వల్ల కలిగే లాభాలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

పాత పద్ధతుల్లో జరిపే తుంటి శస్త్రచికిత్సలో.. కండరాలను లోతుగా కోయాల్సి వచ్చేది. దీనివల్ల రక్తస్రావం అధికంగా ఉండేది. తీవ్రమైన నొప్పి బాధించేది. కానీ, ఇప్పుడు ముందువైపు నుంచి కండరాల మధ్యలోనే శస్త్రచికిత్స (అంటీరియర్ అప్రోచ్) చేయడం వల్ల కండరాలు ఎక్కువగా దెబ్బతినకుండా ఉంటాయి. రక్తస్రావం తక్కువే! అంతేకాకుండా నొప్పి కూడా తక్కువగానే ఉండటం వల్ల రోగులు త్వరగా కోలుకుంటారు. కొంతమంది రోగులు 1-2 వారాల్లోనే ఎలాంటి సపోర్ట్ లేకుండా నడవగలుగుతున్నారు.

## మినిమల్లి ఇన్వేసివ్ సర్జరీ (ఎంఐఎస్)

గతంలో అయితే 10-12 అంగుళాల కోతలు పెట్టాల్సి వచ్చేది. ఎంఐఎస్ పద్ధతి ద్వారా ఇప్పుడు కేవలం 3 నుంచి 5 అంగుళాల చిన్నపాటి కోతలతోనే సర్జరీ పూర్తి చేస్తున్నారు. ఫలితంగా రక్తస్రావం తగ్గి, గాయం త్వరగా మానిపోవడంతో పాటు దవాఖానలో గడపాల్సిన రోజులు కూడా తగ్గుతున్నాయి.

## ఈఆర్‌ఏఎస్ ప్రొటోకాల్స్

ఎన్ హాన్స్‌డ్ రికవరీ ఆఫ్టర్ సర్జరీ విధానంలో శస్త్రచికిత్సకు ముందే రోగికి అవగాహన కల్పించడం, ఎకువసేపు ఉపవాసం లేకుండా చూసుకోవడం, సర్జరీ తర్వాత త్వరగా నడక ప్రారంభించడం వంటి చర్యలు ఉంటాయి. గతంలో 4-5 రోజులు దవాఖానలో ఉండాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు చాలామంది రోగులు ఒకే రోజులో లేదా ఒక రాత్రిలోనే దవాఖాన నుంచి డిశ్చార్జ్ అవుతున్నారు. కొంతమంది రోగులకు శస్త్రచికిత్స చేసిన 4-8 గంటల్లోనే ఇంటికి పంపించే స్థాయికి వైద్యరంగం చేరుకుంది. దీనినే ఔట్‌పేషెంట్ హిప్ రీప్లేస్‌మెంట్ అని వ్యవహరిస్తున్నారు. శస్త్రచికిత్స సమయంలోనే ఎక్స్ రే లేదా ఫ్లోరోసోపీ ద్వారా కప్ పొజిషన్, కాలి పొడవు, జాయింట్ స్థిరత్వం సరిగ్గా ఉన్నాయా లేదా అనేది వైద్యులు చెక్ చేస్తున్నారు.

కంప్యూటర్ అసిస్టెడ్ సర్జరీ: సెన్సర్లు, డిజిటల్ మానిటర్ల సహాయంతో ఇంప్లాంట్‌ను కచ్చితమైన కోణంలో అమర్చే విధానం అభివృద్ధి చెందింది. దీంతో జాయింట్ డిస్‌లొకేషన్ ప్రమాదం తగ్గుతున్నది.

3డీ ప్రీ-ఆపరేటివ్ ప్లానింగ్: రోగి తుంటికి సంబంధించిన సీటీ సాన్ లేదా ఎక్స్-రే ఆధారంగా 3డీ మాడల్ తయారు చేసి, ముందుగానే ఇంప్లాంట్ పరిమాణం, పొజిషన్ ప్లాన్ చేస్తున్నారు.

## రోబోటిక్ హిప్ రీప్లేస్‌మెంట్

రోబోటిక్ సర్జరీ అనేది ఇప్పుడు హిప్ రీప్లేస్‌మెంట్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నది. రోబో సహాయంతో ఇంప్లాంట్‌ను అత్యంత కచ్చితంగా అమర్చగలుగుతున్నారు. వైద్య, ఆరోగ్యరంగ అధ్యయనాల ప్రకారం, సాధారణ పద్ధతిలో 70-80 శాతం కచ్చితత్వం ఉంటే, రోబోటిక్ విధానంలో ఇది 95 శాతం కంటే ఎక్కువగా ఉంటున్నది.

## అత్యాధునిక ఇంప్లాంట్లు

సిమెంట్ లెస్ ఫిక్సేషన్: టైటానియం పూతతో తయారైన ఇంప్లాంట్లలో ఎముక సహజంగా పెరిగి కలిసిపోతుంది. యువకులు, చురుకైన జీవితం గడిపేవారికి ఇవి ఎకువకాలం మన్నుతాయి.

షార్ట్ స్టెమ్స్: ఎముకను ఎకువగా కాపాడే ఈ పద్ధతి భవిష్యత్తులో అవసరమైతే రివిజన్ సర్జరీని సులభతరం చేస్తుంది.

డ్యుయల్ మొబిలిటీ కప్స్: కప్‌లో కప్ తరహా డిజైన్‌తో ఉండే ఈ ఇంప్లాంట్లు డిస్‌లొకేషన్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తాయి.

3డీ ప్రింటెడ్ కస్టమ్ ఇంప్లాంట్లు: 3డీ ప్రింటెడ్ కస్టమ్ ఇంప్లాంట్లు అంటే ఎముక నష్టం ఎకువగా ఉన్న రోగులకు లేదా ప్రత్యేక శరీర నిర్మాణం ఉన్నవారికి వ్యక్తిగతంగా సరిపోయే ఇంప్లాంట్లు తయారు చేస్తున్నారు.

మన్నిక పెంచిన కొత్త బేరింగ్స్

హిప్ జాయింట్‌లో బాల్, సాకెట్ మధ్య రాపిడి తకువగా ఉండటం చాలా ముఖ్యం. ఆధునిక హైలీ క్రాస్ లింక్డ్ పాలిథిలీన్, విటమిన్ ఇ టెక్నాలజీ వల్ల ఇంప్లాంట్ల మన్నిక గణనీయంగా పెరిగింది. ఇప్పుడు 30 సంవత్సరాల పాటు పనిచేసే హిప్ ఇంప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి.

## నొప్పి నియంత్రణలో విప్లవం

మల్టీమాడల్ అనల్జీసియా అంటే భారీ మోతాదులో నొప్పి మందులు కాకుండా, పలు రకాల మందులను కలిపి ఇవ్వడం. దీనివల్ల నొప్పి నియంత్రణ మెరుగుపడుతున్నది. మత్తు మందుల వినియోగం 50-80 శాతం వరకు తగ్గింది.

పెంగ్ నర్వ్ బ్లాక్: అల్ట్రాసౌండ్ సహాయంతో ఇచ్చే ప్రత్యేక నర్వ్ బ్లాక్ వల్ల కాళ్ల బలం తగ్గకుండా నొప్పి నియంత్రణ సాధ్యమవుతున్నది. దీంతో శస్త్రచికిత్స జరిగిన కొన్ని గంటల్లోనే రోగి నడవగలుగుతున్నాడు.

ట్రానెక్సామిక్ యాసిడ్ (టీఎక్‌ఏ): రక్తస్రావాన్ని తగ్గించే ఈ ఔషధం వల్ల రక్త మార్పిడి అవసరం 20 శాతం నుంచి 1 శాతం కంటే కూడా తకువకు పడిపోయింది.

ప్రీహ్యాబ్, డిజిటల్ ఫిజియోథెరపీ: సర్జరీకి ముందే వ్యాయామాలు చేయించడం, మొబైల్ యాప్స్, వేరబుల్ సెన్సర్ల ద్వారా ఇంటి నుంచే ఫిజియోథెరపీ మార్గదర్శకాలు ఇవ్వడం ఇప్పుడు సర్వసాధారణమైంది.

## పాటించాల్సిన జాగ్రత్తలు

హిప్ రీప్లేస్‌మెంట్ తర్వాత మొదటి 6-12 వారాలు అత్యంత కీలకం. ఈ సమయంలో పలు జాగ్రత్తలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

## వాటిలో ముఖ్యమైనవి..

సర్జరీ జరిగిన రోజే వైద్యుల సూచనలతో నడక ప్రారంభించాలి.

ప్రతిరోజూ ఫిజియోథెరపీ వ్యాయామాలు చేయాలి.

నిద్రపోయేటప్పుడు కాళ్ల మధ్య దిండు పెట్టుకోవాలి.

ఎత్తయిన కుర్చీలు, రైజ్డ్ టాయిలెట్ సీట్లు ఉపయోగించాలి.

రక్తగడ్డలు ఏర్పడకుండా వైద్యులు ఇచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడాలి.

జ్వరం, కాలి నొప్పి, గాయం నుంచి నీరు కారడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

చేయకూడనివి

ఆపరేషన్ చేసిన కాలుపై ఒకసారిగా బరువు మోపకూడదు.

నేలపై ఉన్న వస్తువులు వంగి తీసుకోకూడదు.

కాళ్లు ఒకదానిపై ఒకటి వేసుకుని కూర్చోకూడదు.

ఎత్తు తక్కువగా ఉండే సోఫాలు, కుర్చీలు ఉపయోగించకూడదు.

వైద్యుల అనుమతి లేకుండా వాహనం నడపకూడదు.

పరుగు, జంపింగ్, హై ఇంపాక్ట్ క్రీడలు ఆడకూడదు.

బరువు పెరగకుండా జాగ్రత్త పడాలి.

మూడు నెలల తర్వాత చాలామంది రోగులు సాధారణ జీవితానికి చేరుకుంటారు. సైక్లింగ్, ఈత, గోల్ఫ్, హైకింగ్, తేలికపాటి వ్యాయామాలు చేయవచ్చు. అయితే తుంటిపై అధిక ఒత్తిడి పడే యోగా భంగిమలకు, అలసట, వేగంతో కూడుకున్న క్రీడలకు దూరంగా ఉండటం మంచిది.

# మిక్స్‌డ్ వర్కవుట్లు మరింత మేలు

ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం ఎంత వ్యాయామం చేశాం అన్నది కాదు.. ఎలాంటి వ్యాయామాలు చేశాం అన్నదీ ముఖ్యమే అని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. రోజూ ఒకే వ్యాయామం చేస్తే సరిపోతుంది అనే అభిప్రాయాన్ని ఈ పరిశోధనలు తప్పుబడుతున్నాయి. శరీరాన్ని ఒకే విధంగా కాకుండా విభిన్నంగా కదిలించడం వల్ల గుండె నుంచి మెదడు వరకు అన్ని అవయవాలు చురుకుగా పనిచేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా మిక్స్‌డ్ వ్యాయామాలు చేసే వారిలో ఆయుష్షు పెరగడం, ఒత్తిడి తగ్గడం, ఇమ్యూనిటీ మెరుగుపడటం లాంటి ప్రయోజనాలు కనిపించాయని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ చేసిన ఈ పరిశోధనలో 1,11,000 మందికి పైగా వ్యక్తుల ఆరోగ్య, వ్యాయామ అలవాట్లను 30 సంవత్సరాలకు పైగా పరిశీలించారు. ఇందులో ఒకే రకమైన వ్యాయామం చేసే వారితో పోలిస్తే, విభిన్న రకాల వర్కవుట్లు చేసే వారిలో ముందస్తు మరణాల ప్రమాదం 19% వరకు తక్కువగా కనిపించింది. గుండె జబ్బుల వల్ల మరణాల ప్రమాదం 22% తగ్గింది. క్యాన్సర్ కారణంగా మరణించే ప్రమాదం



15% వరకు తక్కువగా కనిపించింది. ఒకే వ్యాయామాన్ని ప్రతిరోజూ చేయడం కాకుండా వివిధ రకాల శారీరక చలనాలను కలిపి చేయడమే మిక్స్‌డ్ ఎక్సర్‌సైజ్. ఉదాహరణకు... వాకింగ్, యోగా, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, సైక్లింగ్, మెట్లు ఎక్కడం, గార్డెనింగ్, స్విమ్మింగ్, డ్యాన్స్ లాంటివి మార్చి మార్చి చేయడం వల్ల శరీరంలోని వేర్వేరు వ్యవస్థలు చురుకుగా పనిచేస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. ఇందులో వేగమైన నడక (బ్రిస్క్ వాకింగ్), మెట్లు ఎక్కడం, టెన్నిస్ వంటి రాకెట్ ఆటలు, స్ట్రెంగ్త్ ట్రెనింగ్ చేసినవారిలో మరణాల ప్రమాదం గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. విభిన్నమైన వర్కవుట్లు ప్రయత్నించినవారు మంచి ఫలితాలు పొందవచ్చు అన్నమాట.

# ప్రపంచ ఏఐ దిగ్గజంగా టీసీఎస్

- 130 కీలక క్లయింట్ కంపెనీలతో డీల్స్
- 2.7 లక్షల మంది ఏఐ నిపుణులతో సిద్ధం
- 'బిల్డ్--పార్ట్‌నర్--అక్వైర్' వ్యూహంతో విస్తరణ
- గ్లోబల్ లీడర్‌గా అవతరించడమే లక్ష్యం
- వార్షిక నివేదికలో సీఈవో, ఎండీ కృతివాసన్ వ్యాఖ్యలు




న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత టెక్నాలజీ సేవల సంస్థగా అవతరించడమే టీసీఎస్ లక్ష్యమని ఆ కంపెనీ సీఈవో, ఎండీ కె.కృతివాసన్ తెలిపారు. 2025--26 వార్షిక నివేదికలో షేర్‌హోల్డర్లను ఉద్దేశించి రాసిన లేఖలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. వ్యాపార సంస్థల్లో ఏఐ వినియోగానికి 2025--26 ఆర్థిక సంవత్సరం ఒక 'కీలక మలుపు' గా నిలిచిందన్నారు. క్లయింట్లు ఏఐని ప్రయోగాత్మక దశ నుంచి పూర్తిస్థాయి అమలువైపు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.

## టాప్ క్లయింట్ల ఫస్ట్ ఛాయిస్

"ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సేవల సంస్థగా అవతరించడమే టీసీఎస్ లక్ష్యం. ఏటా 50 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయం అందించే 139 మంది కీలక క్లయింట్లలో ఇప్పటికే 130 మంది ఏఐ ప్రాజెక్టుల కోసం టీసీఎస్‌ను భాగస్వామిగా ఎంపిక చేసుకోవడం మా వ్యూహానికి దక్కిన విజయానికి నిదర్శనం' అని కృతివాసన్ తెలిపారు. మౌలిక సదుపాయాల నుంచి ఇంటెలిజెన్స్ వరకు పూర్తి స్థాయి (ఫుల్--స్టాక్) ఏఐ సేవలను అందించే సంస్థగా టీసీఎస్‌ను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

2.7 లక్షల మందికి ఏఐ శిక్షణ

భారీ సాంకేతిక మార్పులకు అనుగుణంగా టీసీఎస్ ఉద్యోగులకు పెద్దఎత్తున శిక్షణ ఇస్తోందని కృతివాసన్ తెలిపారు. ప్రస్తుతం 2.7 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఏఐలో అత్యాధునిక నైపుణ్యాలు సాధించారని, గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య మూడు రెట్లు పెరిగిందన్నారు.

## డిజిటల్ సేవల్లో చెరగని ముద్ర

భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతంలో టీసీఎస్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ ఈ--మార్కెట్‌ప్లేస్ (జీఈఎం)ను ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఈ--కామర్స్ వేదికగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ వేదిక ద్వారా జరిగిన కొనుగోళ్ల విలువ రూ.5 లక్షల కోట్లను దాటిందన్నారు. ఎస్‌బీఐ 'యోనో 2.0'ను పది భాషల్లో 20 కోట్ల మందికి సేవలు అందించేలా అప్‌గ్రేడ్ చేశామన్నారు. కోటికి పైగా ఈ--పాస్‌పోర్టుల జారీ, ఆర్బీఐ కోసం 250 టీబీ డేటాను విశ్లేషించగల మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు వంటి మైలురాళ్లను ఆయన వివరించారు.

## వ్యూహాత్మక కొనుగోళ్లు, లక్ష్యాలు

ఏఐ ఎకోసిస్టమ్‌లో 'బిల్డ్--పార్ట్‌నర్--అక్వైర్' వ్యూహాన్ని అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా అమెరికాకు చెందిన లిస్ట్‌ఎంగేజ్, కోస్టల్ క్లౌడ్ సంస్థలను కొనుగోలు చేశామని తెలిపారు. దీంతో గ్లోబల్ సేల్స్‌ఫోర్స్ కన్సల్టెంట్లలో టీసీఎస్ టాప్--5లో నిలిచిందన్నారు. అలాగే టీపీజీ భాగస్వామ్యంతో 'హైపర్‌వాల్ట్' ఏఐ మౌలిక సదుపాయాల వ్యాపారాన్ని ప్రారంభించామని, భారత్‌లో 1 గిగావాట్ (జీడబ్ల్యూ) సామర్థ్యం గల డేటా సెంటర్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు.

## మేధోపరమైన మౌలిక సదుపాయంగా కృత్రిమ మేధ

కృత్రిమ మేధ (ఏఐ) ఇకపై కేవలం సాంకేతిక పరిజ్ఞానంలో ఒక భాగం మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థల నిర్వహణకు 'మేధోపరమైన మౌలిక సదుపాయం' గా మారుతోందని టీసీఎస్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కంపెనీ వార్షిక నివేదికలో షేర్‌హోల్డర్లను ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'హ్యూమన్ ప్లస్ ఏఐ' ఆపరేటింగ్ మోడల్ అమలును టీసీఎస్ మరింత విస్తరించిందన్నారు. ఏఐ సేవల ద్వారా వార్షిక ప్రాతిపదికన 2.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.19,320 కోట్లు), క్లౌడ్, డేటా, సైబర్ భద్రత వంటి న్యూ--ఏజ్ సేవల ద్వారా 11.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.96,600 కోట్లు) ఆదాయం ఆర్జించినట్లు పేర్కొన్నారు. భారత్‌లో తొలి ఏఐ కేంద్రీకృత డేటా సెంటర్: సురక్షితమైన, స్థిరమైన, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మౌలిక సదుపాయాల ఏర్పాటుపై భవిష్యత్ వ్యూహాన్ని కేంద్రీకరిస్తున్నట్లు చంద్రశేఖరన్ వెల్లడించారు. ఇందులో భాగంగా భారత్‌లో మొట్టమొదటి 'ఏఐ కేంద్రీకృత డేటా సెంటర్' ను నిర్మించేందుకు టీసీఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఇది 160 కిలోవాట్ల (కేడబ్ల్యూ) కంటే ఎక్కువ ర్యాక్ డెన్సిటీతో అత్యంత శక్తివంతంగా ఉంటుందన్నారు. అలాగే వివిధ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక 'ఏఐ ఆపరేటింగ్ సిస్టమ్'ను అభివృద్ధి చేసి, 'ఏజెంటిక్ ఏఐ' సొల్యూషన్స్ అమలును వేగవంతం చేయడం కంపెనీ ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటిగా ఉంటుందన్నారు. జోరుగా లాభాలు.. నిలకడగా నియామకాలు: గత ఆర్థిక సంవత్సరపు(2025--26) ఫలితాలను విశ్లేస్తూ కంపెనీ వృద్ధి బాటలో పయనిస్తోందని చంద్రశేఖరన్ ధీమా వ్యక్తం చేశారు. మార్చి త్రైమాసికంలో టీసీఎస్ నికరలాభం 12.22 శాతం వృద్ధితో రూ.13,718 కోట్లకు చేరుకోగా, 2025--26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం లాభం రూ.49,210 కోట్లుగా నమోదైంది. గత రెండు త్రైమాసికాల్లో ఉద్యోగుల సంఖ్యలో తగ్గుదల కనిపించినప్పటికీ, ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో కొత్తగా 2,356 మందిని నియమించుకున్నామని తెలిపారు. దీంతో 2026 మార్చి 31 నాటికి సంస్థలోని మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,84,519 కి చేరింది.

కొత్త డీల్స్: గడిచిన మూడు నెలల్లోనే టీసీఎస్ 12 బిలియన్ డాలర్ల విలువైన కొత్త ఒప్పందాలను కుదుర్చుకుంది. ఇందులో ఉత్తర అమెరికా,

బ్యాంకింగ్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగాలు కీలక పాత్ర పోషించాయి.

## భవిష్యత్తు వ్యూహాలపై ఫోకస్

భవిష్యత్తులో నాలుగు ప్రధాన వ్యూహాలపై దృష్టి సారించనున్నట్లు కృతివాసన్ వెల్లడించారు. వివిధ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ఏఐ వ్యవస్థల నిర్మాణంతో పాటు, భారత్‌లో తొలి 'హై--డెన్సిటీ ఏఐ డేటా సెంటర్'ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 3,600 భాగస్వామ్యాల సహకారంతో 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టు ఇంటెలిజెన్స్' సేవలను మరింత బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. దేశీయ డేటా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సురక్షితమైన, స్థిరమైన, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మౌలిక సదుపాయాల ఏర్పాటే తమ లక్ష్యమన్నారు.

# స్పెషల్ ఎట్రాక్షన్



కమర్షియల్ సినిమాలో హీరో ఉంటారు. ఫైట్స్, పాటలు ఉంటాయి. అయినా అదనపు ఆకర్షణ కావాలి. ఆడియన్స్ కోసం ఓ ప్రత్యేక గీతం థియేటర్స్‌లో ప్లే అవ్వాలి. అందుకే కొందరు హీరోలు స్టోరీలో స్పెషల్ సాంగ్ చేసే స్కోప్ ఉంటే, సై అంటున్నారు. ఆ పాటలు చేయడానికి హీరోయిన్లు కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ప్రేక్షకులను ఉత్సాహపరిచే స్టెప్పులు వేస్తున్నారు. మరి... ఏ సినిమాలో ఏ నటి స్పెషల్‌గా కనిపించనున్నారో ఓసారి లుక్ వేయండి.









జైలర్‌తో స్టెప్పుల్

మంచి కమర్షియల్ మోడ్‌లో కనిపిస్తున్నారు రజనీకాంత్. ఈ సీనియర్ హీరో నటించిన గత రెండు చిత్రాలు 'జైలర్, కూలీ' కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌గా ఆడియన్స్‌ను అలరించాయి. అలాగే ఈ రెండు చిత్రాల్లోనూ స్పెషల్ సాంగ్స్ ఉన్నాయి. 'జైలర్' చిత్రంలోని 'కావాలయ్యా..' పాటలో తమన్నా అదిరిపోయే స్టెప్పులు వేస్తే, 'కూలీ' చిత్రంలోని 'మోనికా..' పాటలో పూజా హెగ్డే డ్యాన్స్ మూమెంట్స్‌ను ఇరగదీశారు. కాగా రజనీకాంత్ పూర్తి చేసిన తాజా చిత్రం 'జైలర్ 2'లోనూ ఓ స్పెషల్ సాంగ్ ఉంది. ఈ సాంగ్‌ను బాలీవుడ్ నటి నోరా ఫతేహీ చేశారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ కూడా పూర్తయింది. 'జైలర్' సినిమాకు దర్శకత్వం వహించిన నెల్సన్ దిలీప్ కుమార్ సీక్వెల్‌గా రానున్న 'జైలర్ 2' మూవీకి దర్శకత్వం వహించారు. రమ్యకృష్ణ, మిర్నా మీనన్, యోగిబాబు, మిథున్ చక్రవర్తి, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారని తెలిసింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన 'జైలర్ 2' చిత్రం జూన్‌లో విడుదల కానుంది. ఈ సినిమాకి అనిరుధ్ స్వరకర్త. అన్నట్లు... నోరా ఫతేహీ గురించి మన తెలుగు ఆడియన్స్‌కు ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఎందుకంటే..'బాహుబలి: ది బిగినింగ్'లో 'మనోహరి', 'టెంపర్'లో 'ఇట్టాగే రెచ్చిపోదాం పిల్లా..' ఇలా పలు స్పెషల్ సాంగ్స్‌లో నోరా నర్తించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

స్పెషల్ ఎంట్రీ

టాలీవుడ్‌కి స్పెషల్ ఎంట్రీ ఇచ్చారు బాలీవుడ్ నటి మౌనీ రాయ్. చిరంజీవి హీరోగా నటించిన 'విశ్వంభర' చిత్రంలో మౌనీ రాయ్ ఓ స్పెషల్ సాంగ్ చేశారని తెలిసింది. దాదాపు వందమంది డ్యాన్సర్స్‌తో గణేష్ ఆచార్య కొరియోగ్రఫీలో ఈ పాటను చిత్రీకరించారు మేకర్స్. ఈ పాటలో చిరంజీవి, మౌనీ రాయ్ డ్యాన్స్ చేశారు. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించారు.

ఈ సినిమాలో చిరంజీవి చెల్లెళ్లుగా ఇషా చావ్లా, రమ్య పసుపులేటి వంటి హీరోయిన్లు నటించారని తెలిసింది. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు. ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఈ 'విశ్వంభర' సినిమా విడుదల కానుంది. ఈ సినిమాకి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

మాస్ డ్యాన్స్

రామ్‌చరణ్ టైటిల్ రోల్‌లో నటించిన రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌లో హీరో రామ్ చరణ్‌తో కలిసి శ్రుతీహాసన్ అదిరిపోయే మాస్ స్టెప్పులు వేశారు. ఈ స్పెషల్ సాంగ్‌కు కుస్తీతో కూడిన ఓ కాన్సెప్ట్ కూడా ఉందట. అంతేకాదు... ఈ సినిమా హీరోయిన్ జాన్వీ కపూర్ కూడా ఈ పాటలో కాలు కదిపారని సమాచారం. ఇదే నిజమైతే ఒకే ఫ్రేమ్‌లో చరణ్, జాన్వీ శ్రుతీహాసన్‌లను చూడటం మాస్ ఆడియన్స్‌కు థియేటర్స్‌లో విజిల్ వర్తీ మూమెంట్ అని చెప్పవచ్చు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

ఇక బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1970--1980 మధ్య కాలంలో సాగుతుంది. ఇందులో క్రాస్ ఓవర్ అథ్లెట్‌గా రామ్‌చరణ్ నటించారు. అంటే... ఈ చిత్రంలో రామ్‌చరణ్ క్రికెట్, కుస్తీ ఆడతారు. మరొక గేమ్ కూడా ఉంది. ఈ గేమ్‌పై త్వరలోనే స్పష్టత రానుంది. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదల కానుంది. మరోవైపు మహేశ్‌బాబు 'ఆగడు', అర్జున్ కపూర్ 'తేవర్' చిత్రాల్లో శ్రుతీహాసన్ స్పెషల్ సాంగ్స్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది.



ఆలియా ఆటా పాటా!

'రౌద్రం... రణం... రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాలో ఎన్టీఆర్, ఆలియా భట్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఈ ఇద్దరూ మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని తెలిసింది. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'డ్రాగన్' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా తెలిసింది. ఈ పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని సమాచారం. కాగా, ఈ సినిమాలో ఒక ప్రత్యేక పాటకు స్కోప్ ఉంది.

ఈ పాటలో నటిస్తారంటూ శ్రుతీహాసన్, రష్మికా మందన్నా, మృణాల్ ఠాకూర్ వంటి హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ ఈ పాటలో ఆలియా భట్ కనిపిస్తారనే ప్రచారం తాజాగా తెరపైకి వచ్చింది. ఇదే నిజమైతే, 'డ్రాగన్' సినిమా కోసం ఎన్టీఆర్, ఆలియా భట్ మరోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 11న విడుదల కానుంది. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

ది ప్యారడైజ్‌లో తమన్నా!

స్పెషల్ సాంగ్స్‌కు ఓ కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారు హీరోయిన్ తమన్నా. అంతేకాదు... ఈ బ్యూటీ ఫలానా సినిమాలో స్పెషల్ సాంగ్ చేశారంటే, ఆ సినిమా హిట్టవుతుందనే టాక్ కూడా ప్రచారంలోకి వచ్చింది. రజనీకాంత్ 'జైలర్' సినిమాలో 'కావాలయ్యా..', కావొచ్చు, హిందీ చిత్రం 'స్త్రీ 2'లో 'ఆజ్ కీ రాత్' కావొచ్చు, మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు'లో 'డాంగ్ డాంగ్..' పాట కావొచ్చు... తమన్నా స్పెషల్ సాంగ్ చేశారంటే, ఆ సినిమాకు అది తప్పకుండా ప్లస్ అవుతుంది. తాజాగా 'ది ప్యారడైజ్' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేసేందుకు తమన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'ది ప్యారడైజ్'. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో సికింద్రాబాద్ యువకుడు జడల్ పాత్రలో నాని నటిస్తున్నారు. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌కు స్కోప్ ఉందట. దీంతో ఈ సాంగ్‌కు తమన్నా అయితే బాగుంటుందని మేకర్స్ అనుకుంటున్నారట. ఆ దిశగా సంప్రదింపులు మొదలయ్యాయని సమాచారం. అయితే ఈ 'ది ప్యారడైజ్' చిత్రంలో తమన్నా స్పెషల్ సాంగ్ చేయనున్న అంశంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఇక ఈ చిత్రంలో మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలుత ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 26న రిలీజ్ చేయాలనుకున్నారు. ఈ తేదీకి విడుదల కుదరకపోవడంతో, ఈ ఏడాది ఆగస్టు 21కి వాయిదా వేశారు. అయితే ఆగస్టు 21వ తేదీన కూడా ఈ సినిమా విడుదల కాకపోవచ్చని, అనుకున్న ప్రకారం ఈ సినిమా షూటింగ్ సాగడం లేదని, రీ షూట్స్ చేయాల్సి వస్తోందనే ప్రచారం జరిగింది. కానీ అలాంటిది ఏమీ లేదని, అనుకున్న ప్రకారమే 'ది ప్యారడైజ్' సినిమా చిత్రీకరణ జరుగుతోందని, ఆగస్టు 21న ఈ సినిమా విడుదల అవుతుందని టీమ్ మరోసారి స్పష్టత ఇచ్చింది.

నేను రెడీ

టాలీవుడ్‌కు వచ్చేందుకు నేను రెడీ అన్నారు బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ. స్పెషల్ సాంగ్‌తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు ఈ బ్యూటీ. హిందీలో 'హౌస్‌ఫుల్ 3, హౌస్‌ఫుల్ 5, 5 వెడ్డింగ్స్' వంటి చిత్రాల్లో నటించారు నర్గీస్. అలానే సల్మాన్ ఖాన్ 'కిక్'లో 'యార్ నా మిలే', తమిళ హీరో ప్రశాంత్ 'సాగసం'లో స్పెషల్ సాంగ్స్ చేశారు నర్గీస్. ఇప్పుడు తెలుగు సినిమాకు వచ్చారు. హవీష్, కావ్యాథాపర్ హీరో హీరోయిన్లుగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా 'నేను రెడీ'.

ఈ చిత్రంలోని ఓ స్పెషల్ సాంగ్‌లో డ్యాన్స్ చేశారు నర్గీస్. టాలీవుడ్‌లో నర్గీస్ చేసిన తొలి సినిమా ఇదే. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పీ పతాకంపై త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మించిన ఈ చిత్రం జూన్ రెండో వారంలో విడుదల కానుంది. బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిశోర్, మురళీ శర్మ, వీటీవీ గణేష్, గోపరాజు రమణ, హరితేజ, మహతి ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ 'నేను రెడీ' సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.

అలాగే 'నేను రెడీ' సినిమా విడుదల కాకముందే, తెలుగులో ఇంకో సినిమాలో మరో స్పెషల్ సాంగ్ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారట నర్గీస్. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. ముంబై నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌లో నర్గీస్ ఫక్రీ డ్యాన్స్ చేశారని తెలిసింది. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కావొచ్చు.

బ్లాక్ గోల్డ్‌లో సీరత్ ... ఉమెన్ సెంట్రిక్ సినిమాల్లో అరుదుగా ప్రత్యేక పాటలు చూస్తుంటాం. హీరోయిన్ సంయుక్త నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'ది బ్లాక్‌గోల్డ్'. తెలంగాణ -- మహారాష్ట్ర సరిహద్దులోని బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమాను కేఎమ్‌సీ యోగేష్ దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించారు. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు సంయుక్త. దేశాన్ని కుదిపేసిన కోల్ సిండికేట్‌ల బ్యాక్‌డ్రాప్‌లో నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రంలో హీరోయిన్ సీరత్ కపూర్ స్పెషల్ సాంగ్ చేశారని తెలిసింది. ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో ఈ పాటను రిలీజ్ చేయాలనుకుంటున్నారట మేకర్స్. ఈ సంగతి ఇలా ఉంచితే.. కె. విజయభాస్కర్ దర్శకత్వంలో శ్రీకమల్, తన్వీ లీడ్ రోల్స్‌లో నటించిన 'ఉషా పరిణయం' (2024) చిత్రంలో సీరత్ కపూర్ ప్రత్యేక పాటలో మెరిశారు. ఇక శర్వానంద్ 'రన్ రాజా రన్'లో హీరోయిన్‌గా నటించిన సీరత్ కపూర్ నాగార్జున 'రాజుగారి గది 2', అల్లు శిరీష్ 'ఒక్క క్షణం', రవితేజ 'టచ్ చేసి చూడు' వంటి చిత్రాల్లో కీ రోల్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా మరికొందరు తారలు స్పెషల్ సాంగ్స్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసింది.

## శరీరంలో రక్త సరఫరా సరిగ్గా లేకపోతే కనిపించే లక్షణాలు ఇవే..

# ఈ ఆహారాలను తినాలి..!



మన శరీరంలో అన్ని భాగాలకు, కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా రవాణా అయ్యేందుకు గాను రక్త సరఫరా వ్యవస్థ నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటుంది. రక్త సరఫరా సరిగ్గా ఉంటేనే అన్ని భాగాలకు పోషకాలు, ఆక్సిజన్ లభిస్తాయి. దీంతో మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే కొన్ని రకాల కారణాల వల్ల కొందరిలో రక్త సరఫరా సరిగ్గా ఉండదు. దీంతో పలు వ్యాధులు వస్తుంటాయి. పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ అనే వ్యాధి ఉన్నవారిలో, డయాబెటిస్ ఉన్నా, అధికంగా బరువు ఉన్నవారిలో, పొగ తాగేవారిలో, డీప్ వీన్ థ్రాంబోసిస్ (డీవీటీ) అనే సమస్య ఉన్నవారిలో, క్రానిక్ వీనస్ ఇన్‌సఫిషియెన్సీ (సీవీఐ) అనే సమస్య ఉన్నవారిలో రక్త సరఫరా సరిగ్గా ఉండదు. అలాగే నిత్యం గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేసేవారు, బీపీ, కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారిలో కూడా రక్త సరఫరా సక్రమంగా ఉండదు.

### రక్త సరిగ్గా లేకపోతే కనిపించే లక్షణాలు..

రక్త సరఫరా సరిగ్గా లేకపోతే మన శరీరం పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. చేతులు, పాదాల్లో స్పర్శ లేనట్లు అనిపిస్తుంది. కొన్ని సార్లు ఆయా భాగాల్లో సూదులతో గుచ్చినట్లు కూడా అనిపిస్తుంది. పాదాలు, మడమలు వాపులకు గురవుతాయి. వేలితో నొక్కితే సొట్ట పడుతుంది. తరచూ కండరాల నొప్పులు ఉంటాయి. ముఖ్యంగా రాత్రి పూట కాలి పిక్కలు తరచూ పట్టుకుపోతుంటాయి. రక్త సరఫరా సక్రమంగా లేనివారి శరీరం మొత్తం పాలిపోయినట్లు కనిపిస్తుంది. కళ ఉండదు. గాయాలు, పుండ్లు నెమ్మదిగా మానుతాయి. తీవ్రమైన అలసట, నీరసం ఉంటాయి. జుట్టు రాలిపోతుంది. కాళ్లు, చేతులపై ఉండే వెంట్రుకలు కూడా బాగా రాలిపోతుంటాయి. ఇవన్నీ శరీరంలో రక్త సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలియజేసే లక్షణాలు.

### ప్రాణాంతకం కావచ్చు..

శరీరంలో రక్త సరఫరా సక్రమంగా సరిగ్గా ఉండకపోతే దీర్ఘకాలంలో పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్ వస్తుంది. సాధారణంగా దీన్ని కనిపెట్టలేరు. కానీ పైన తెలిపిన లక్షణాలు కనిపిస్తే మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ఏదైనా సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే చికిత్స తీసుకోవాలి. రక్త సరఫరా సక్రమంగా లేని వారికి డాక్టర్లు మందులను సూచిస్తారు. వాటిని క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. అలాగే రోజూ తప్పనిసరిగా 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. నిద్రపోవాలి. రోజుకు తగినంత మోతాదులో నీళ్లను కూడా తాగాల్సి ఉంటుంది. అలాగే ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీని వల్ల ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

### ఈ ఆహారాలను తినాలి..

రక్త సరఫరా సక్రమంగా లేని వారు కచ్చితమైన డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతో ప్రాణాంతక పరిస్థితులు రాకుండా నివారించవచ్చు. ముఖ్యంగా బీట్ రూట్, పాలకూర, చేపలు, వాల్ నట్స్, అవిసె గింజలు వంటి ఆహారాలను తింటుండాలి. వీటిల్లో అనేక సమ్మేళనాలతోపాటు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తాయి. అలాగే ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండే స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలు, రాస్ప్ బెర్రీలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లు కూడా మేలు చేస్తాయి. డార్క్ చాక్లెట్, వెల్లుల్లి, క్యాప్సికం, పసుపు వంటి ఆహారాలను తింటున్నా కూడా సమస్య తగ్గుతుంది. ఇలా రక్త సరఫరాను మెరుగు పరుచుకుని గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# అదే నా లక్ష్యం

### వెనక్కు తిరిగి చూసుకుంటే..

మలయాళం, తమిళ, తెలుగు భాషల్లో నటిస్తూ క్రేజీ కథానాయికగా రాణిస్తోంది హీరోయిన్ మమితా బైజు. మలయాళంలో నటించిన ప్రేమలు చిత్రంతో అందరి దృష్టిని తనవైపు ఆకర్షించింది. ఆ తర్వాత కోలీవుడ్, టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి దక్షిణాదిలో ట్రెండింగ్ హీరోయిన్‌గా వెలుగొందుతోంది. ఇటీవల డ్యూడ్ మూవీతో మరో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉంది. ఈమె విజయ్‌తో కలిసి నటించిన జననాయకన్ (తెలుగులో జన నాయకుడు) చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. అదే నా లక్ష్యం

అలాగే సూర్యకు జంటగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇకపోతే అశోక్ సెల్వన్‌కు జంటగా నటించిన ఇరండు విధానం చిత్రం కూడా విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రాలు విడుదలైన తర్వాత మమితా బైజు క్రేజ్ వేరేగా ఉంటుందని భావించవచ్చు. ఇటీవల ఈ అమ్మడు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నా అభిమానుల గుండెల్లో నిలిచిపోయే చిత్రాలను చేయాలన్నదే నా లక్ష్యం. అలా ఒక ప్రేమైక కుటుంబాన్ని తయారు చేసుకోవాలని కోరుకుంటున్నాను. ఇకపోతే ఏదో ఒక రోజున నా జరిగిన కాలం గుర్తుకు వస్తే ఆనందం కలగాలి. అందుకోసమే నా ఈ ప్రయాణం' అని మమిత పేర్కొంది.



# ఘోస్ట్ బర్డ్... సీజన్ కో రంగు మార్చుతుంది!



ఉత్తర అమెరికా పర్వతాల్లో కనిపించే వైట్-టైల్డ్ టార్మిగాన్ పక్షి

రుతువులకు అనుగుణంగా రంగులు మార్చుకోవడం దీని ప్రత్యేకత

శీతాకాలంలో మంచులో కలిసిపోయేలా పూర్తిగా తెల్లగా మారడం

వేసవిలో రాళ్లలో దాక్కునేలా బూడిద రంగులోకి మార్పు

మంచులో నడిచేందుకు సాయపడే ఈకలతో నిండిన కాళ్లు







ప్రకృతిలో జీవరాశుల మనుగడ ఎన్నో అద్భుతాలకు, వింతలకు నిలయం. పరిసరాలకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటూ జీవించే ఎన్నో జీవులు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఈ కోవకే చెందింది వైట్-టైల్డ్ టార్మిగాన్ (ఔప్త్రత్వవ్ఖఅత్రీవస గ్ఘుతీఎఅస్త్రుఅ) అనే చిన్న పక్షి. ఉత్తర అమెరికాలోని ఎత్తైన పర్వత ప్రాంతాల్లో నివసించే ఈ పక్షి, రుతువులకు అనుగుణంగా తన రంగును పూర్తిగా మార్చుకోగలదు. శీతాకాలంలో ఈ పక్షి శరీరం మొత్తం మంచులా స్వచ్ఛమైన తెలుపు రంగులోకి మారిపోతుంది. దీనివల్ల మంచుతో కప్పబడిన పరిసరాల్లో శత్రువుల కంట పడకుండా సులభంగా కలిసిపోతుంది. అదే వేసవి, వసంత కాలాల్లో దీని ఈకలు బూడిద, గోధుమ రంగు మచ్చలతో విభిన్నంగా ఉంటాయి. ఇది రాళ్లు, టండ్రా నేలపై సులభంగా దాక్కోవడానికి సహాయపడుతుంది. ఈ అద్భుతమైన అనుసరణే దీని మనుగడకు కీలకం. సుమారు అర కిలో బరువుండే ఈ పక్షి తోక ఎప్పుడూ తెల్లగానే ఉంటుంది. అందుకే దీనికి "వైట్-టెయిల్డ్" అనే పేరు వచ్చింది. దీని కాళ్లపై దట్టమైన ఈకలు ఉండి, "స్నో ప్యాంట్స్" లాగా చలి నుంచి రక్షణ కల్పిస్తాయి. అంతేకాకుండా, మంచు మీద తేలికగా నడిచేందుకు "స్నోషూస్" లాగా కూడా ఉపయోగపడతాయి. చాలా నిశ్శబ్దంగా, అప్రమత్తంగా ఉండటం వల్ల దీనిని 'ఘోస్ట్ బర్డ్' అని కూడా పిలుస్తుంటారు. ప్రస్తుతం ఈ పక్షి జాతికి ఎలాంటి ప్రమాదం లేదని ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచుర్) స్పష్టం చేసింది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .